తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ fb.com/vaartha

PUBLISHED FROM WARANGAL, KARIMNAGAR, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

22-2-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 22, పేజీలు : 8+16 వెల : 6.50



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


**టర్కీలో మళ్లీ భూకంపం**

ముగ్గురు మృతి, 200 మందికి గాయాలు

**బైడెన్ ఉక్రెయిన్ టూర్‌కు సీక్రెట్ ప్లానింగ్**

5లో



# యుద్ధానికి కారణం పాశ్చాత్య దేశాలే

### చర్చలకు మేం సిద్ధమే: రష్యా అధ్యక్షుడు పుతిన్


**మాస్కో, ఫిబ్రవరి 21:** ఉక్రెయిన్ ప్రస్తుత పరిస్థితికి పాశ్చాత్య దేశాలే కారణమని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆరోపించారు. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, సమస్య పరిష్కారం కావడానికి పాశ్చాత్య దేశాలే సిద్ధంగా లేవని ఆయన విమర్శించారు. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ప్రారంభమై యేడాది అవుతున్న సందర్భంగా తన దేశ ప్రజలనుద్దేశిస్తూ పుతిన్ ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పర్యటించిన మరుసటి రోజే పుతిన్ ఈ ఆరోపణలు చేయడం గమనార్హం. ' మేం సమస్యను పరిష్కరించేందుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను దశలవారీగా జాగ్రత్తగా క్రమపద్ధతిలో పరిష్కరిస్తాం. కానీ, మా వెనక పూర్తిగా భిన్నమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రష్యా సరిహద్దు వద్దకు నాటో విస్తరించాలని భావించింది. మనం మన దేశ ఉనికి గురించే మాట్లాడుతున్నాం. ఉక్రెయిన్‌లో ప్రస్తుత పరిస్థితికి పాశ్చాత్య దేశాలదే బాధ్యత. సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ఆ దేశాలు సిద్ధంగా లేవు. వాటి వైఖరితో సమస్య మరింత జఠిలం అవుతోంది. ≫2

### స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక:

# మజ్లిస్‌కు బిఆర్ఎస్ మద్దతు

### ఎంఐఎం అభ్యర్థిగా బరిలోకి దిగిన మీర్జా రెహమత్ బేగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి21:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార బిఆర్ఎస్ పార్టీ ఎంఐఎంకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మిత్రపక్షమైన ఎంఐఎం చేసిన అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నా




రు. దీంతో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి బిఆర్ఎస్ వైదొలిగి...ఎంఐఎంకు తోడుగా నిలవనుంది. పార్టీలోని సీనియర్లతో చర్చించిన అనంతరం హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో మజ్లీస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సిఎం కెసిఆర్ ≫2



# కర్ణాటక బరిలో బిఆర్ఎస్!

### 20 నుంచి 25 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి సన్నద్ధం

### కుమారస్వామితో ఫోన్‌లో కెసిఆర్ మంతనాలు

### త్వరలో కర్ణాటకలో పర్యటించనున్న సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** భారత్ రాష్ట్ర సమితి అధినేత,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరావు త్వరలో కర్ణాటక రాష్ట్ర పర్యటన చేయనున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఈ ఏడాది మేలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పోటీ చేసేందుకు పూర్తి స్థాయిలో పార్టీని సిద్దం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ ప్రధాని హెచ్‌డి దేవేగౌడ నేతృత్వంలోని జనతాదళ్ (సెక్యూలర్) పార్టీతో వ్యూహాత్మక పొత్తు పెట్టుకునేందుకు బిఆర్ఎస్ అధినేత సమాలోచనలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో జనతాదళ్‌తో కలిసి పనిచేయాలన్న నిర్ణయాన్ని సిఎం కెసిఆర్ తర్వలో అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం. మార్చి నెల చివరలో లేదా ఏప్రిల్ నెల మొదట్లో ఇందుకు సంబంధించి ఇరు పార్టీల అధ్యక్షులు సమావేశమై ఉమ్మడి ప్రకటన చేయనున్నట్లు బిఆర్ఎస్‌పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బిఆర్ఎస్ కారు గుర్తుతోనే నామినేషన్ వేసి ఎన్నికల రణరంగంలో దిగాలన్న ప్రతిపాదనకు ఆ పార్టీ అగ్రనేత మాజీ సిఎం కుమారస్వామి కూడా అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిజెపి,కాంగ్రెస్ పార్టీలను నిలువరించాలంటే బిఆర్ఎస్ లాంటి నూతన రాజకీయ శక్తి ఎంతో అవసరమన్న భావనతో జేడీఎస్ వర్గాలు ఉన్నాయి.ఈ మేరకు తెలంగాణ పొరుగున ఉన్న 20 నుంచి 25 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కెసిఆర్ సిద్దమైనట్లు సమాచారం. బెంగుళూర్ మహా నగరంలో రెండు,మూడు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను పోటీకి దింపే అంశంపై కూడా సిఎం కెసిఆర్ సమాలోచనలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి.

నిజాం కాలంలో హైదరాబాద్ రాష్ట్రం పరిధిలో కర్ణాటకలోని కొన్నిప్రాంతాలు ఉండేవి. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని కళ్యాణ కర్ణాటక(కేకే)గా పిలుస్తున్నారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న దాదాపు 30లోపు నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలో నిలపాలన్న అంచనాకు వచ్చినట్లు చెబుతున్నారు. కళ్యాణ కర్ణాటకు చెందిన కాంగ్రెస్, బిజెపికు చెందిన 20 మంది కీలకనేతలు బిఆర్ఎస్‌లో ≫2

# ములుగు జిల్లాలో మావోల లేఖల కలకలం!

### పాము నూరు రోడ్డుపై బీరు బాటిల్ బాంబు

### స్పెషల్ బలగాల గాలింపు ముమ్మరం



అడవిలో కూంబింగ్‌కు వెళ్తున్న స్పెషల్ బలగాలు

**తాడ్వాయి, ప్రభాతవార్త:** ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లాలో బీర్‌సీసాలో బాంబు పెట్టిన సంఘటన కలకలం రేపింది. ఏడాది కాలంగా ప్రశాంతంగా ఉంటున్న ములుగు జిల్లాలోని మండలాలు మావోయిస్టు నక్సల్స్ రెండు సంఘటనలకు పాల్పడి అలజడి రేపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి భావంతో ప్రజలందరూ శివాలయంలో పూజలు చేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మావోయిస్టులు సివిల్ దుస్తుల్లో బయటకు రావడంతో ఛత్తీస్‌ఘడ్‌లోని భూపాలపట్నం ఏరియాలో సంచరిస్తున్న మావోయిస్టు నేతను పసిగట్టి పట్టుకుని అరెస్టు చేశారని మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ హెచ్చరించారు. తమనేతను వదిలిపెట్టక పోతే ప్రభుత్వమే బాధ్యత వహించాలని ≫7

### క్షమాపణలు కోరుతూ

# గవర్నర్‌కు లేఖ రాస్తా..

### -బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి21:** తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకుగానూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి క్షమాపణలు తెలియజేశారు. ఈ వ్యాఖ్యలకుగానూ నోటీసులు అందుకున్న ఆయన ఢిల్లీలోజాతీయ మహిళాకమిషన్ ఎదుటమంగళవారం హాజరు అయ్యారు. సుమారు 40 నిమిషాల పాటు ఎమ్మెల్సీని మహిళా కమిషన్ విచారించింది. ≫2

# వీధి కుక్కల దాడి

### అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడు మృతి



మంగళవారం హైదరాబాద్ అంబర్‌పేటలో బాలుడిని వెంటాడుతున్న వీధికుక్కలు

### కిందపడేసి ఈడ్చుకెళ్లిన శునకాలు

### తప్పించుకునేందుకు బాలుడి విఫలయత్నం

### సిసిటివి కెమెరాలో ఒళ్లు జలదరించే దృశ్యాలు

### విషాదంలో బాలుడి తల్లిదండ్రులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. అభంశుభం తెలియని ఐదేళ్ల బాలుడిపైన కుక్కలు దాడిచేశాయి. జంతువులను వేటాడినట్టుగా కుక్కలన్నీ ఆ చిన్నారిపై అన్ని వైపుల నుంచి దాడిచేయడంతో నిస్సహాయంగా శరీరాన్ని వాటికి అప్పగించి ప్రాణాలు కోల్పోయాడు. ఒంటరిగావెళుతున్న బాలుడిపైకి ఎగబడ్డాయి. తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా కిందపడేసి, నోట కరిచి లాక్కెళ్లాయి. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. అంబర్‌పేటలో ఆదివారం జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన దయనీయ దృశ్యాలు అక్కడున్న సిసిటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ డిఐ ప్రభాకర్, అడ్మిన్ ఎస్సై మల్లేశం కథనం ప్రకారం..నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం కేంద్రానికి చెందిన గంగాధర్ నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. అంబర్‌పేట ≫2




### గ్యాంగ్‌స్టర్‌నెట్‌వర్క్‌పై

# ఎన్ఐఎ సోదాలు

### ఏడు రాష్ట్రాల్లో 70 ప్రాంతాల్లో తనిఖీలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** గ్యాంగ్‌స్టర్ సిండికేట్లను బ్రేక్ చేసేందుకు ఎన్ఐఎ రంగంలోకి దిగింది. జాతీయ స్థాయిలో అత్యంత కీలకమైన దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దేశవ్యాప్తంగా 70 ప్రాంతాల్లో సోదాలునిర్వహించింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయి సన్నిహితుడు కుల్వీందర్ ఇంటిని కూడా తనిఖీచేసారు. కుల్వీందర్ గాంధీధామ్‌లో ఉంటున్నాడు.కుల్వీందర్ దీర్ఘకాలంగా బిష్ణోయి అనుయాయుడుగా ఉన్నాడు. బిష్ణోయి గ్యాంగ్‌కు షెల్టర్ ఇస్తుంటాడు. అలాగే కుల్వీందర్ అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్‌తో కూడా లింకులున్నట్లు తెలుస్తోంది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ, చండీఘర్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ సోదాలునిర్వహించారు. ఒక గ్యాంగ్‌స్టర్ ఆతని క్రిమినల్ కార్యకలాపాలపై కేసులునమోదుచేసిన ఎన్ఐఎ అధికారులు ఈ తనిఖీలు, సోదాలునిర్వహించారు. గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్‌పై వరుసగా నాలుగోసారి ఎన్ఐఎ దాడులునిర్వహించింది. ఒక్క పంజాబ్‌లోనే 30 కేంద్రా ల్లో ఈ సోదాలుజరిగాయి. హర్యానాలోకూడా యమునానగర్ ముందా మజ్రా ప్రాంతంలోనిర్వహించారు.ఆజాద్‌నగర్‌లో స్థానిక పోలీసులు ఎన్ఐఎ బృందాలతో కలిసి సోదాలునిర్వహించారు.

### ఆస్తుల సృష్టిలో

# తెలంగాణ అగ్రస్థానం

**దేశంలోనే రాష్ట్రానికి రెండోస్థానం**

**2.30 కోట్ల చదరపు అడుగులకు పెరిగిన భవనాలు**

**జిల్లాల్లో 40 లక్షల చదరపు అడుగుల ఆస్తులు**




**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఆస్తుల సృష్టిలో దేశంలోని అన్ని ప్రధాన రాష్ట్రాల్లో కెల్లా తెలంగాణ సర్కార్ అగ్రస్థానంలో ఉంది. ఆస్తుల కల్పనకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రాధాన్యత ఇస్తుండటంతో తెలంగాణకు ఈ రికార్డు సాధ్యపడింది. గత ఎనిమిదేళ్లలో ఆస్తులను కూడగట్టుకోవడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అసాధారణ వృద్ధిరేటును సాధించడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాట్లు అయిన 2014 జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వం వద్ద మొత్తం 60 లక్షల చదరపు అడుగుల భవనాలు ఉన్నాయి. ఈ ఎనిమిదేళ్లలో దీన్ని 2 కోట్ల 30 లక్షల చదరపు అడుగులకు పెంచడంలో కేసీఆర్ సర్కార్ రికార్డు ≫2

### కస్టడీ మృతిపై సర్కారుకు

# హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన మెదక్ జిల్లా కస్డడీ మరణంపై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ ఘటనలో ఖదీర్‌ఖాన్ అనే చిరు వ్యాపారి పోలీసుల దెబ్బలకు తాళలేక చనిపోయినట్లు ఆరోపణలు రావడంతో ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని హై కోర్టు సర్కారుకు ఆదేశించింది. ఇందులో ప్రతి వాదులుగా చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డిజిపి అంజనీ కుమార్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, మెదక్ జిల్లా ఎస్‌పి ప్రియదర్శిని, మెదక్ డిఎస్‌పి, ≫7

# కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు



అవినీతి నిరోధక చట్టం అధికారులకు ధరణి ఆపరేటర్ రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన నోట్లు

## రూ. 20 వేలు లంచంతో పట్టుబడిన ధరణి ఆపరేటర్ వేణురెడ్డి

## ఏకకాలంలో కార్యాలయం, వేణు గృహంలో సోదాలు

**కౌడిపల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కౌడిపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి (అవినీతి నిరోధక చట్టం) అధికారులు మంగళవారం నాడు ఆకస్మికంగా దాడులు నిర్వహించి, ఓ రైతు వద్ద నుండి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్‌గా ధరణి ఆఫరేటర్ వేణురెడ్డి పట్టుబడినట్లు మెదర్ రేంజ ఎసిబి డిఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన నీరుడి పోచయ్య గత నెల జనవరి 25వ తేదీన తమ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. నీరుడి పోచయ్య 20 గుంటల భూమిని రిజిస్టన్ చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో 10 గుంటల భూమిని అమ్ముకోవడం జరిగినట్లు ఆయన తెలిపారు. మిగిలిన 10 గుంటల భూమిని తన పేర రిజిస్ట్రేన్ చేసుకోవడానికి తహశీల్దార్ కార్యాలయంలో ధరణి ఆఫరేటర్ వేణురెడ్డిని సంప్రదించగా అట్టి భూమిని రిజిస్ట్రేన్ చేసుకోవడానికి రూ. 20 వేలు లంచంగా ఇవ్వాలని ఖరాఖండిగా చేప్పగా, అంతా ఇచ్చుకోలేనని, స్లాట్ బుకింగ్‌కు మాత్రం డబ్బులు చెల్లించగలనని పోచయ్య చేప్పినట్లు ఆయన తెలిపారు.
స్లాట్ బుకింగ్ డబ్బులు ప్రభుత్వానికి చెల్లించబడుతాయని, తమకు తప్పకుండా రూ. 20 వేలు లంచం ఇవ్వాలని తెల్చిచేప్పగా, లంచం ఇవ్వలేక తమను బాధితుడి ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. నీరుడి పోచయ్య వద్ద డబ్బులు సర్దుబాటుకాగానే తమకు తెల్పి నేడు ధరణి ఆఫరేటర్‌కు రూ. 20 వేలు లంచంగా ఇవ్వబోగా తన సహాయకుడు కేతవాత్ రాజుకు ఇవ్వాలని తెల్పిగా అతను కార్యాలయంలో వరండాలో లంచం ఇస్తుండగా తాము రేడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. ప్రస్తుతానికి ఇద్దరిని అదుపులోకి తీసుకోని విచారణ ఇంక కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏవరైనా తమ పనిని ప్రభుత్వపరంగా చేయించుకోవడానికి లంచం అడుగుతే వెంటనే ప్రభుత్వ టోల్ ఫ్రీ నం. 1064 నంబరుకు సమాచారం అందించగలరని, వారి పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. కాగా కౌడిపల్లి తహశీల్దార్ కార్యాలయ ధరణి ఆఫరేటర్ వేణు రెడ్డి లంచం తీసుకుంటున్నట్లు వచ్చిన పిర్యాదు మేరకు వేణురెడ్డి స్వగృహమైన కామారెడ్డి జిల్లా తాడువాయి మండలం నందివాడ గ్రామంలో సైతం ఏకకాలంలో ఎసిబి దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విచారణలో నిజనిరూపణలు జరిగితే ధరణి ఆఫరేటర్ వేణు రెడ్డి, అతనికి సహకరించిన కేతవాత్ రాజులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిబి డిఎస్పీతోపాటు ఇన్స్‌పెక్టర్లు వేంకట రాజా గౌడు, రమేష్, ఎసిబి సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.




# మెట్ట భూముల్లో సుస్థిర వ్యవసాయానికి చర్యలు

## వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** మెట్ట భూముల పరిస్థితిని మెరుగుపరచి సుస్థిర వ్యవసాయానికి దారులు వేయాలని వ్యవసాయ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ ఇక్రీశాట్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతూ తెలంగాణలో మెట్ట భూముల సమస్యలపై ప్రాంతాల వారీగా నిర్దిష్ట పరిశోధనా ఫలితాలను విడుదల చేయాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కలిసి పరస్పర సహకారంతో నేలలో ఉండే కర్బన శాతాన్ని,నేల జీవ వైవిధ్యాన్ని మెరుగుపరిచే స్థాయిలో పరిశోధనలు చేయాలన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలో మెట్ట భూములు మెరుగుపరచేందుకు అవసరమైన నూతన సాంకేతికతను సృష్టించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ, పోషణ, భద్రత తదితర అంశాలపై మెట్ట భూములకు సంబంధించి పరిశోధనలు చేయడం మంచి పరిణామమని చెప్పారు. మెట్ట భూములను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# సంక్షేమ గురుకుల పోస్టుల భర్తీ మరింత జాప్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమ గురు కులాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియ మరింత జాప్యం కానుంది. ఆయా సంక్షేమ శాఖల గురుకులాల్లో 9,096 పోస్టుల భర్తీకి సంబంధించి జూన్ నెలలోనే ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో బిసి గురుకులాలకు సంబంధించి 3,870 పోస్టులు, సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో 2,267 పోస్టులు, గిరిజన గురుకులాల్లో 1,514 పోస్టులు, మైనార్టీ గురుకులాల్లో 1,445 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీ నిమిత్తం తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ నోటిఫికేషన్ ఇవ్వకుండా తాస్సారం చేస్తూ వస్తోంది.
అయితే ఏమైందో ఏమో గత నెలాఖరులో 1,900 పోస్టుల భర్తీకి ఆనుమతి ఇచ్చినట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. అయితే గురుకుల విద్యాలయాల సంస్థ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ ఇప్పటి వరకూ ఇవ్వ లేదు. ఇక ఇప్పుడు రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల రెండో వారంలో విడుదలైంది. దీంతో ఎన్నికల కోట్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ ముగిసిన తదుపరి నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నట్ల తెలియవచ్చింది.

## సిటీ సాయుధ బలగం హెడ్ క్వార్టర్స్‌లో

# పదోన్నతుల జవాన్లకు శిక్షణ పూర్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** నగరంలోని పేట్లాబుర్జులో గల సాయుధ బలగం హెడ్ క్వార్టర్స్‌లో పదోన్నతుల నిమిత్తం రెండు వారాల శిక్షణకు వచ్చిన 130 మంది సాయుధ బలగాల కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తయ్యింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి నగర సాయుధ బలగం హెడ్ క్వార్టర్స్ జాయింట్ సిపి ఎం. శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సాయుధ బలగం పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. 130 మంది జవాన్లు రెండు వారాల పాటు అనేక అంశాలలో శిక్షణ పూర్తి చేసుకుని కానిస్టేబుళ్ల నుంచి హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి పొందడం ఆనందంగా వుందని ఆయ న తెలిపారు.



పేట్లబుర్జులోని సిటీ సాయుధ బలగం హెడ్‌క్వార్టర్స్‌లో పదోన్నతుల కోసం వచ్చిన జవాన్లకు శిక్షణ పూర్తయిన సందర్భంగా హాజరైన హెడ్ క్వార్టర్స్ జాయింట్ సిపి శ్రీనివాసులు. చిత్రంలో పిటిసి ప్రిన్సిపాల్ మద్దిపాటి శ్రీనివాస్ తదితరులు

రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన సాయుధ బలగాలకు చెందిన వారు ఒకేచోట ఒకేసారి శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకోవడం అరుదైనదిగా ఆయన తెలిపారు. అవుట్ డోర్, ఇండోర్ విభాగాల్లో అందరు ఉత్తమ శిక్షణ పొందారని ఆయన తెలిపారు. కాగా సాయుధ బలగం హెడ్ క్వార్టర్స్‌లో గల సిటీ పోలీసు శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ మద్దిపాటి శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇక్కడకు శిక్షణ కోసం వచ్చిన వారంతా ఉన్నత శిక్షణను పొందారని అన్నారు. చివరగా శిక్షణ పొందిన వారు తమ అనుభవాలను పంచుకుకోవడంతో పాటు తమకు లభించిన శిక్షణ ఉత్తమంగా వుందని తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీల కాంట్రాక్ట్ లెక్చరర్ల వేతనాలు మంజూరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఆ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి జనవరి, 2023 వేతనాలను మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న 797 మందికి ఇప్పటికే గత ఏడాది డిసెంబర్ నెల వరకు వేతనాలను మంజూరు చేశారు. అయితే వారికి జనవరి, 2023 కు సంబంధించిన వేతనాలకుగానూ రూ. 4,69,03,450లను విడుదల చేస్తూ కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు.

# అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ పిజి డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గడువు మార్చి 10

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఆ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో కొత్తగా పీజీ డిప్లమా కోర్సులను ప్రవేశ పెట్టినట్టు యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. పీజీ డిప్లమా ఇన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లమా ఇన్ హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ మరియు పీజీ డిప్లమా ఇన్ ఆపరేషన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను తీసుకోవడానికి మార్చి 10 తుది గడవని వర్సిటీ అధికారులున మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పీజీ డిప్లమా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సుల వివరాలు మొత్తం యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. పూర్తి వివరాల కొరకు ఆన్‌లైన్‌లో లేదా విశ్వవిద్యాలయ షెల్ఫ్ డెస్క్ నంబర్లు 7382929570, 7382929580 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని యూనివర్సిటీ అధికారులు సూచించారు.

# బిఆర్ఎస్ నాయకుడు రజాక్ గుండెపోటుతో మృతి

**హైదరాబాద్ (చార్మినార్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పాతబస్తీ కాలికబర్ ప్రాంతానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు షేక్ రజాక్ (42) గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కొడుకు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో తీవ్రంగా ఛాతి నొప్పి రావడంతో తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల బిఆర్ఎస్ నాయకులు అనీల్ కుమార్, మహ్మద్ ఇస్మాయిల్‌తో పాటు పలువురు సంతాపం తెలియజేసి వారి కుటుంబాన్ని ఓదార్చారు.

# సాగు నీరు లేక ఎండిపోతున్న పంటలు

## ఆందోళనకు దిగిన రైతులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, వాటికి సరిపడా తడులు అందివ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం ఆందోళనలకు దిగారు. ధర్నా చేస్తూ రోడ్డుపై బైఠాయించి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా ఎండపల్లి రైతులు రాజారాంపల్లి నుండి బసంత్‌నగర్ ఎక్స్ రోడ్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారుల వైఖరికి కారణంగా కష్టించి పండిస్తున్న యాసంగి పంటలు ఎండి పోతున్నాయని వాపోయారు. సాగు నీరు సరఫరా చేయకపోవడంతో జిల్లాలోని ముంజంపల్లి, మారేపల్లి, ఉండేడా తదితర గ్రామాల్లో దాదాపు 400 ఎకరాల భూముల్లోని వివిధ పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ నిర్మాణాలు చేపట్టి పంట పొలాలకు నీరు అందకుండా చేశారని, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ నుండి పంప్ హౌస్ ద్వారా సాగు నీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఓ పక్క పంటలు ఎండుతుంటే పంప్ హౌస్‌లు రన్ చేయడం లేదని మండిపడ్డారు. రైతులందరం కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేస్తే పరిహారం డబ్బులు కూడా ఇవ్వలేదని, కనీసం తమ పంట పొలాలకు సాగు నీరు కూడా ఇవ్వడం లేదని కన్నీటి పర్యాంతమయ్యారు. తమ పంట పొలాలకు నీరు అందించలేకనట్లయితే తాము చేస్తున్న ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై వేటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** తమకు పెడుతున్న భోజనం బాగా లేదన్నందుకుగాను 10వ తరగతి విద్యార్థులపై దాష్టికం ప్రదర్శించిన బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై వేటు పడింది. సంక్షేమ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఖమ్మం జిల్లాలోని మధిర బిసి గురుకుల బాలికల పాఠశాలలో భోజనం బాగా లేదన్నందుకు ఈ నెల 18వ తేదీన 10వ తరగతి విద్యార్థులను ప్రిన్సిపల్ నసీమా చితకబాదారు. ఈ సంఘటనపై రీజినల్ కోఆర్డినేటర్ జ్యోతి విచారణ జరిపారు. ఈ విచారాణకు సంబంధించిన నివేదిక ప్రకారం అధికారులు ప్రిన్సిపాల్ నసీమాపై వేటు వేశారు. ఈమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ప్రిన్సిపాల్ గా ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ నిరూషను నియమిస్తూ అధికారులు నిర్ణయించారు.

# కాంగ్రెస్ సభలు పెట్టుకుంటే బిజెపికి ఎందుకు భయం?

## సీనియర్ నేత వి.హానుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ సభలు పెట్టుకుంటే బిజెపికి ఎందుకు భయం అని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఉండవద్దనే ఉద్దేశ్యంతో బిజెపి వ్యవహరిస్తుందన్నారు. కావాలనే కాంగ్రెస్ నేతలను కేసులతో వేధిస్తున్నారన్నారు. బిజెపి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. చత్తీస్‌ఘడ్ కాంగ్రెస్ నేతలకు ఈడి నోటీసుల వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నారన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలన్ని బిజెపి గుప్పిట్లో ఉన్నాయన్నారు. చత్తీస్‌ఘడ్‌లో ఏఐసిసి ప్లీనరీ సమావేశాల సందర్భంగా అక్కడి సిఎం భూపేష్ బాగేల్ సోదరుడికి ఈడి నోటీసులు ఇచ్చారన్నారు. వీధి కుక్కలను నియంత్రణ చేయకపోతే చిన్న పిల్లలపై దాడులు పెరుగుతాయని, జిహెచ్ఎంసి అప్రమత్తంగా ఉండి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలన్నారు. హైదరాబాద్‌లో కుక్కల వల్ల చాలా మంది పిల్లలు చనిపోయారని, ఇందుకు మందు కుక్కలను నియంత్ర చేసేవారు కానీ ఇప్పుడు చేయడం లేదన్నారు. కుక్కల దాడిలో మరణించిన బాలుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కుక్కలు పట్టుకోవడానికి టీమ్‌ను ఏర్పాటు చేసి నియంత్రణ చేయాలన్నారు.
రాజీవ్‌గాంధీ పేరుతో 15 సంవత్సరాల నుంచి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ సారి భారత్ జోడో ఆల్ ఇండియా అండర్ 19 టీ 20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 17 టీమ్స్‌లు పాల్గొంటున్నాయన్నారు. రాహుల్‌గాంధీకి మద్దతుగా భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 22 నుంచి 25వ తేది వరకుమొత్తం మూడు క్రీడా మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి


## ఎస్‌టియు అభ్యర్థి భుజంగరావును ఎమ్మెల్సీగా గెలిపించాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఆ తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి ఎస్‌టీయూ టీఎస్ తరపున పోటీ చేస్తున్న సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు బి భుజంగరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యా యులందరూ మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి ఎమ్మెల్సీగా ఎన్నుకొని శాసనమండలికి పంపించాలన్నారు. మార్చి 13న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భుజంగరావు పోటీ చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎస్‌టీయూ టీఎస్ హైదరాబాద్‌లో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం జీహెచ్ఎంసీ కార్యాలయంలో భుజంగరావు ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.




ఈ సభలో ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డితోపాటు భుజంగరావుకు మద్ధతు ప్రకటించిన పలు ఉపాధ్యాయ సంఘాల, హెడ్మాష్టర్స్ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 75 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకలను పూర్తిచేసుకున్న చరిత్ర కలిగిన ఎకైక సంఘంగా ఎస్‌టీయూ టీఎస్ చరిత్రకెక్కిందన్నారు. గతంలో ఎస్‌టీయూ నుండి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వీపీ రాఘవాచారి, అప్పరసు శ్యాంసందర్‌రావు వంటి మేథావులు మండలిలో తమ గళాన్ని వినిపించి క్లిష్టమైన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని వారు గుర్తు చేశారు. కానీ నేడు ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయుల సమస్యలను గాలికి వదిలేసి సొంత ప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల సమస్యలను తాకట్టు పెట్టారని అపడంలో అతిశయోక్తి లేదన్నారు. ప్రస్తుతం ఎస్‌టీయూ టీఎస్ తరపున పోటీ చేస్తున్న భుజంగరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు.




సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ

# తాటి, ఈత చెట్ల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

## కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించే తాటిఈత చెట్లను రియల్ టవర్లు ధ్వంసం చేస్తున్నారని, వీరిపై ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని, వనాలను సంరంక్షించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కమిటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎం.వి.రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం వల్ల తాటి, ఈత చెట్లను విపరీతంగా నరికివేస్తున్నారని, రక్షించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారంలో లక్షలాది చెట్లను నాటుతున్న ప్రభుత్వం ఇప్పటికే ఉన్న తాటిఈత చెట్లను రక్షించే చర్యలు కూడా తీసుకోవాలని, గత ప్రభుత్వం భూమి కొనుగోలు పథకంలో 439 సొసైటీలకు 5 ఎకరాల చొప్పున భూములిచ్చారని, 560 జీవో ప్రకారం ప్రభుత్వ స్థలం ఉన్న చోట కొన్ని సొసైటీలకు పట్టాలిచ్చారని, వీటన్నింటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని చెట్ల పెంపకం చేపట్టాలని డిమాండ్ చేశారు. గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కెటిఆర్ వాగ్దానం చేసిన హామీలు ద్విచక్రవాహనాలు, గీతన్నబంధు, గీతన్న బీమా పది రోజుల్లో ఎక్స్‌గ్రేషియా, సొసైటీలకు లిక్కర్ షాపులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయనయ, బాల్నే వెంకటమల్లయ్య, గౌని వెంకన్న, బొలగాని జయరాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్.రమేశ్‌గౌడ్, బండకింది అరుణ్‌కుమార్, గాలి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సాయన్న దళితుడైనందుకే వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

## అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ఎందుకు జరపలేదు?

## 24 గంటల మూడు ఫేజ్‌ల కరెంట్ వస్తుందని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

## హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** సాయన్న ఒక దళిత బిడ్డ, ఐదు సార్లు ఎమ్మెల్యేగా సేవలందించారు, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే, కేలం దళితుడైనందుకే సర్కార్ అతని అంత్యక్రియలు అధికార లాంఛనాలతో జరపలేదని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కేసీఆర్ దొర అహంకారం బయటపడిందని, దళితులపై ఆయన ధోరణి తేటతెల్లమైందన్నారు. ఆయన అవమానించింది దళిత జాతిని అని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన బీజేపీ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితుడిని ముఖ్యమంత్రి చేయడం పక్కన పెడితే వారికి కనీస గౌరవం లేదన్నారు. కానీ కేసీఆర్ పనులు, మాటలు అందుకు భిన్నంగా ఉంటాయన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వకుండా బుకాయిస్తున్న పార్టీ టీఆర్ఎస్ అన్నారు. అసెంబ్లీ ప్రజాస్వామ్యానికి ప్రతిక అని, తెలంగాణ ప్రజల భవిష్యత్తును రాసే వేదిక అని అలాంటి గొప్ప ప్రదేశంలో తమ గొంతునొక్కి ప్రజలను వంచించే ప్రక్రియ కొనసాగిందన్నారు. అందుకు తాము ప్రజా వేదికలను ఎంచుకున్నామన్నారు. ధరణి పేదల కొంప ముంచిందని, ఎప్పుడో దొరల కొనుక్కున్న దన్నుకున్న భూములు మళ్లీ దొరల పేరు మీదకు ఎక్కాయని, ఈ దుర్మార్గానికి కారణం కేసీఆర్ అని దుయ్యబట్టారు. రాష్ట్రం ఏర్పడితే పేదల బతుకులు మారుతాయని అనుకుంటే ఆ పేదలను బిచ్చగాళ్లుగా చేసిన వ్యక్తి కేసీఆర్ అని, అసెంబ్లీలో తాను ఈ విషయాలను ప్రస్తావిస్తే అది చిన్న విషయం కోడి గుడ్డు మీద ఈకలు పీకవద్దని బుకాయించారని గుర్తు చేశారు. కేసీఆర్ పచ్చి ఫ్యూడల్ భావజా లాన్ని దొర తనాన్ని తెలియ జెప్పుకొని, పేదల మీద కసి తీర్చుకునే విధానం లో భాగమే ధరణి అని పేర్కొన్నారు. క్వింటాల్ వడ్లకు 10కేజీలు కట్ చేస్తున్నారని తాను అసెంబ్లీలో ప్రస్తావిస్తే స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి అంశాన్ని పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలని మంత్రికి సూచన చేయాలని కాని ఆయనే అలాంటిది ఏమీ జరగడం లేదని చెప్పడం దుర్మార్గం అన్నారు. సర్కార్ దాష్టకానికి వేల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, బిల్లులు రాక సర్పంచులు, కాంట్రాక్టర్లు, ఉద్యోగాలు రాక యువత అప్పుల బాధతో రైతులు ఆత్మ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని నేటికీ మోసం చేస్తున్నారని చెప్పారు. ఒకే ఏడాది రూ.24వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చేయలేదన్నారు. 30లక్షల రైతులను ఎగవేతదారుల జాబితాలో చేర్చిన ఘనత కేసీఆర్‌ది అని ఫైర్ అయ్యారు. 24గంటల త్రిఫేజ్ కరెంట్ వస్తుందని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. 45వేల కోట్ల ఆదయం వెనక తెగిపడ్డ పుస్తెలు ఎన్నో తెలుసుకోవాలని ప్రశ్నించారు. ప్రజల్లో ఉన్న ద్వేషం కసి తమకు తెలుసని, కేసీఆర్ ప్రభుత్వానికి పోయే కాలం వచ్చిందని ఈ ప్రభుత్వాన్ని కాపాడే శక్తి దేవుడు కూడా కోల్పోయాడన్నారు.

మనలో లోపాలే లేవనుకోవడానికి మించిన తప్పిదం మరొకటి లేదు.
-కార్లైల్

# ఐరాస ప్రక్షాళనే విశ్వశాంతికి మార్గం!

రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ సోమవారం అకస్మాత్తుగా ఉక్రెయిన్‌లో ప్రత్యక్షమయ్యారు. రష్యా, ఉక్రెయిన్‌పై దాడి ఆరంభించి దాదాపు యేడాది కావస్తున్న ఈతరుణంలో సంఘీభావం సంకేతాలు ఇచ్చేందుకే జోబైడెన్ ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకున్నట్టు చెప్తున్నారు. కీలకమైన యుద్ధ సమయంలో అమెరికా అధ్యక్షుడు ఉక్రెయిన్‌లో పర్యటించడం వెనుక ఆ దేశానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఐక్యంగా ఉంచడం కోసం ఈ పర్యటన ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో రెండువైపుల నుంచి యుద్ధం తీవ్రం అవుతున్న అంచనాలు వెలువడుతున్నాయి.గత యేడాదిగా సాగుతున్న ఈ పోరును అత్యంత కిరాతకం, అన్యాయమైన యుద్ధంగా అభివర్ణించారు. అమెరికా ఉక్రెయిన్‌తో కలిసి ఉందని ప్రకటిస్తూ హోవిట్జర్ షెల్స్ యాంటీ ట్యాంకు మిసైల్స్ ఎయిర్ సర్వైలెన్స్ రాడార్లు తదితర యుద్ధసామాగ్రితోసహా 50 మిలియన్ డాలర్ల అదనపు సహాయాన్ని కూడా ప్రకటించారు.తమకు చేసిన వాగ్దానాల మేరకు ఆయుధాలను అందించాలని జెలెన్‌స్కీ మిత్రపక్షాలను కోరారు. అన్నింటికంటే ముఖ్యంగా యుద్ధ విమానాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇక ఉక్రెయిన్‌కు త్వరగా ఫిరంగిగుళ్లను అందించేందుకు యూరోపియన్ యూనియన్ మార్గాలను అన్వేషించాలని ఈయూ దౌత్యాధికారులు కోరారు. ఇందులో ఏమాత్రం లోపం జరిగినా ఈ యుద్ధంలో ఉక్రెయిన్ ఓటమిపాలయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మొత్తం మీద ఉక్రెయిన్‌లో జోబైడెన్ పర్యటన యుద్ధమేఘాలను మరింత కమ్ముకునేలా చేస్తాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా విశ్వశాంతికోసమే ఆవిర్భవించిన ఐక్యరాజ్యసమితి యుద్ధనివారణ విషయంలో పటిష్టమైన చర్యలు,చొరవ చూపలేకపోతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడేకాదు ఎన్నో విషయాల్లో ఐక్యరాజ్యసమితి తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ మౌనంగా ఉండిపోవడం పట్ల అసలు ఐరాస లక్ష్యానికి దూరమవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. భారత సరిహద్దులను పలుప్రాంతాలను చైనా ఆక్రమించినప్పుడు ఐక్యరాజ్యసమితి మౌనం వహించిందనే చెప్పొచ్చు. అఫ్ఘాన్ పరిణామాలు, కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్ దుశ్చర్యల గురించి స్పష్టంగా తెలిసినా మౌనంగానే ఉండాల్సివస్తున్నది. అన్నింటికంటే ముఖ్యంగా వీటో అధికారం కలిగిన దేశాలు తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం వివిధ సందర్భాల్లో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న దేశాలకు తమ మద్దతును అందిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రోహింగుల సమస్యకు మద్దతు ఉన్నా పరిష్కరించడంలో ఐరాస వైఫల్యాన్ని చైనా, రష్యా, మయన్మార్ మద్దతు ఇవ్వడమే కారణమనేది జగమెరిగిన సత్యం. ప్రపంచ శాంతే లక్ష్యంగా ఆవిర్భవించిన ఐరాస క్రమేణా అందుకు దూరమవుతున్నదేమోననిపిస్తున్నది. రెండోప్రపంచ యుద్ధ సమయంలో ఐరోపాపై జర్మనీ దాడిని నిరసిస్తూ అప్పటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్, బ్రిటన్ ప్రధాని చర్చిల్ సంయుక్తంగా 1941లో అట్లాంటిక్ చార్టర్‌ను ప్రకటించారు. ఐరాస పునాదికి ఇది మొదటి అడుగుగా చెప్పొచ్చు. 1945జూన్26న యాభై దేశాల ప్రతినిధులు అగ్రరాజ్యంలోని శాన్‌ఫ్రాన్సికో ఐరాస్ చార్టర్‌పై సంతకాలు చేశారు. ఎట్టకేలకు 1945 అక్టోబరు 24న న్యూయార్క్‌లో ఐరాస ఆరంభమైంది.అంతర్జాతీయ శాంతి, యుద్ధనివారణ వంటి సిద్ధాంతాలతో ఈసంస్థ ఆవిర్భవించింది. ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా ఏమేరకు లక్ష్యాన్ని సాధించిందంటే ఆలోచించాల్సిందే. ఐరాసలో మొత్తం 193 సభ్యదేశాలున్నాయి.భద్రతామండలిలో ఐదుశాశ్వత సభ్యదేశాలు, పది తాత్కాలిక సభ్యదేశాలకు చోటుకల్పించారు.రెండో ప్రపంచ యుద్ధం విజేతలు అయిన అమెరికా,యునైటెడ్ కింగ్‌డమ్, రష్యా,ఫ్రాన్స్‌లతోపాటు చైనాకు సైతం భద్రతామండలిలో వీటో అధికారం కల్పించారు. ఈ అధికారాలను ఉపయోగించుకొని ఆ ఐదుదేశాలు ఐరాస రూపొందించిన బిల్లునుకానీ, తీర్మానాన్ని కానీ చెల్లకుండా చేయగలుగుతున్నాయి. సైనిక బలగాలను పంపడానికి,వివిధ దేశాలపై ఆంక్షలు విధించడానికి ఈవీటో అధికారం ఉపయోగపడుతుందనేది ఎన్నోసార్లు రుజువు అయింది. శాంతిభద్రతలు పరిరక్షించడమే ధ్యేయంగా ఆవిర్భవించిన ఐరాసకు ఈ వీటో అధికారం ఆటంకంగా తయారైంది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన ఎన్నో సంక్షోభాలను శాంతియుత మార్గాల ద్వారా పరిష్కరించడానికి ఐరాస ఎన్నోసార్లు ప్రయత్నం చేసింది. కానీ వాటి అమలుకోసం భద్రతామండలి సకాలంలో చర్యలు తీసుకోవడానికి నిరాకరించడంతో ఫలితం లేకుండాపోయింది. వీటో అధికారం కలిగిన దేశాలు తమతమ సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాయి. రష్యా అత్యధికంగా వీటో అధికారాన్ని ఇప్పటివరకు ఉపయోగించుకున్నది. ఆ తర్వాత స్థానంలో అమెరికా నిలుస్తుండగా ఇటీవల కాలంలో చైనా కూడా ఎక్కువగానే ఉపయోగించుకుంటున్నది. ప్రస్తుతం ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురి చేస్తూ ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న బాంబుల వర్షాన్ని నిలువరించలేకపోతున్నది. అలాగే అమెరికా పూర్తి మద్దతు ఉండడం వల్ల పాలస్తీనా భూభాగంపై సాగుతున్న ఇజ్రాయిల్ దాడులను భద్రతామండలి నివారించలేకపోతున్నది. ఆనాడు పరిస్థితులకు అవసరాలను దృష్టిలోఉంచుకొని ఏర్పాటు చేసిన ఐరాసాను ప్రక్షాళన చేయాల్సిన తరుణమిది. అప్పుడే విశ్వశాంతి పరిరక్షణకు ఐరాస అడుగులు వేస్తుంది. లక్ష్యానికి చేరువవుతుంది.

> రాజకీయం అనేది గొప్పకళ. పేదల నుండి ఓట్లు, సంపన్నుల నుండి నోట్లు తీసుకొని ఒకరి నుంచి మరొకరిని రక్షిస్తామని చెప్పడమే రాజకీయం.



**ఆస్కార్ అమెరింగల్**

> మానవ మేధాశక్తి విజ్ఞానానికి సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించగలదు. కాని అది మానవతా విలువల విషయంలో ఎదుర్కొనే సమస్యలకు మాత్రం సమాధానం ఇవ్వలేదు.



**జిడ్డు కృష్ణమూర్తి**

## ప్రజావాక్కు



### ఆగని రుణయాప్‌ల వేధింపులు

మనిషి జీవితంలో డబ్బుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అది అవసరాన్ని బట్టి ఎంతటివారినైనా మార్చేస్తుంది. పేద,మధ్య తరగతి ప్రజలు వారితక్షణ, స్వల్పకాలిక అవసరాలకు అప్పులను రుణయాప్‌ల ద్వారా తీసుకుంటున్నారు. సకాలంలో డబ్బులు చెల్లించినా వాళ్లని ఆ సంస్థలు వేధించడం ఏమాత్రం తగ్గడంలేదు.వాటిఆగడాలురోజురోజుకుమరింత పెరుగుతున్నాయి. యాప్‌ల ఉచ్చులో చిక్కుకొని సామాన్యులు, యువత ఎందరో బలవన్మరణాలకుపాల్పడుతున్నారు.తీసుకున్న డబ్బుకు వడ్డీతో సహా చెల్లించినా మరింత మొత్తం చెల్లించాలని బెదిరిస్తుండటంతో మానసికఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆరు వేల రుణానికి 60వేలు చెల్లించినా ఇంకా కట్టాలని బెదిరించడంతో ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలానికి చెందిన భూక్య ఆకాష్ అనే ఇరవై ఏళ్ల యువకుడు పురుగుల మందు తాగిఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన తాజా ఘటనే లోన్‌యాప్ వేధింపులకు నిదర్శనం.

-తలారి గణేష్, వెల్లంకి, యాదాద్రిజిల్లా

### మళ్లీ రాజధాని రచ్చ మొదలైంది

మళ్లీ రాష్ట్రంలో రాజధాని రగడమొదలైంది. ఈ సమస్య కోర్టులో ఉండగానే మంత్రులు తలా ఒకరకంగా హడావుడి ప్రకటనలు చేస్తున్నారు. తాటి చెట్టు ఎందుకు ఎక్కావు అంటే దూడ మేత కోసంఅన్నట్లు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. గత ప్రభుత్వహయాంలో రాజధాని ఏర్పాటు విషయంలో అక్రమాలు జరిగాయి. కనుక రాజధానిని ఎక్కడో రాష్ట్రానికి మారుమూలన ఉన్న విశాఖపట్నంలో పెడతామంటే కుదరదు. అక్రమాలు జరిగితే తగిన చర్యలు తప్పక తీసుకోవాలి. కానీ లేడికిలేచిందే పరుగు అన్నట్లు ఇలా తొందరపాటు తరలింపుతో వేట కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేయరాదు.

-తిరుమలశెట్టి సాంబశివరావు, నరసరావుపేట

### సముచిత నిర్ణయం!

రాష్ట్రంలో పాలకపక్ష తిరోగమన, నిరంకుశ విధానాలకు అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడానికి సీనియర్ నేత కన్నా లక్ష్మీ నారాయణ నిర్ణయంతీసుకోవడం తప్పనిసరి. ఆహ్వానించదగిన పరిణామం.ప్రజాస్వామ్యవ్యవస్థల మనుగడప్రశ్నార్థకం అయిన ప్రస్తుత పరిస్థితుల్లోరాష్ట్రంలోని ప్రజాస్వామ్య,మౌలికశక్తులన్నీ తమ సిద్ధాంతాలను పక్కనపెట్టి రాష్ట్ర శ్రేయస్సు కోరి ఐక్యం కావాలి.ఇందుకుసానుకూలంగా ప్రతిఒక్కరూ ముందుకు రావాలి. సర్దుబాటు ధోరణితో లక్ష్య సాధనకు కృషి చేయాలి.

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### బెదిరింపులు సరికాదు!

రాష్ట్రంలో అధికారపార్టీఎమ్మెల్యేలు,మంత్రులు ఇటీవల కాలంలో వలంటీర్లను బెదిరిస్తూ మాట్లాడుతున్నారు.ప్రజలు కట్టే పన్నులతో వారికి వేతనాలు ఇస్తున్నారు. వారు అందుకు తగిన సేవలు అందిస్తున్నారు. అధికార పార్టీకి పనిచేయమని, అధికార పార్టీకి మద్దతుగా లేని వారిని గుర్తించి నయానో భయానో వారిని దారికి తీసుకురావాలని హుకుం జారీ చేయడం సిగ్గుచేటు. ప్రజలకు మేలు చేస్తే వారే ఓట్లు వేస్తారు. ఇందుకు వలంటీర్ల ద్వారా బెదిరింపులకు దిగడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఎన్నికల నాటికి ఎవరు ఏ పార్టీలో ఉంటారో ఎవరికి పార్టీ టికెట్ ఇస్తుందో, ఎవరు జైలుకు పోతారో తెలియదు. వలంటీర్లు కట్టుబానిసలు కాదు. వారికి ఆత్మాభిమానం ఉంది. తగిన సమయంలో బుద్ధి చెప్పగలరు.

-ఉప్పలపాటి రాజా, ఏలూరుజిల్లా

### ప్రభుత్వ స్థలాల కబ్జా!

పేదలకు సెంటు భూమి ఇవ్వాలంటే అధికారులు సవాలక్ష ప్రశ్నలు అడుగుతారు. కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటారు. అయితే కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించేస్తుంటే చూసి చూడనట్లు వ్యవహరించడం అధికారులకు ఆనవాయితీగా మారింది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు బడాబాబుల కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. అధికారుల అండ, పాలకుల దండ ఉంటే చాలు ఆక్రమణకు కాదేది అనర్హం అన్నట్లుగా ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి సాగు చేసుకుంటున్నా పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది. శివారు ప్రాంతాలు ఇప్పుడు అక్రమాలకు నెలవుగా మారుతున్నాయి. వీటిని కబ్జాదారుల కబంధహస్తాల నుండి విడిపించి అందులో ప్రభుత్వనిధులతో స్కూలు, పార్కులు, ప్రార్థనా మందిరాలు వంటి అభివృద్ధి పనులు చేపట్టాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ధాన్యం రైతులను ఆదుకోవాలి!

రాష్ట్రవ్యాప్తంగా ఇంకా రైతుల వద్ద 40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మరో నెలరోజులో దాళ్వాధాన్యం నూర్పిళ్లు మొదలవుతాయి. మిల్లర్లఅక్రమాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం చేతులెత్తేయడంతో చాలా ప్రాంతాల్లో రైతులు దాళ్వా సాగు చేపట్టకుండానే పొలాలను బీడు పెట్టారు. ఇందువలన వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోవడం, ప్రభుత్వం పరోక్షంగాఎంతోఆదాయాన్ని కోల్పోతున్నది.పాలకుల అనుభవరాహిత్యం రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బతీసింది.

-జి. కృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# శ్రీభాగ్ ఒప్పందంలో రాజధాని ప్రస్తావన లేదు!

**నాటి సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎటువంటి సవరణ ప్రతిపాదించకుండానే సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఎటువంటి అభ్యంతరం తెలపని జగన్మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత మూడు రాజధానుల పేరిట 1953 నాటి రాయలసీమ నేతల రాజకీయాలను గుర్తు చేస్తూ మరల రాజధాని విషయం వివాదస్పదం చేశారు. ఈ విషయాలు ప్రస్తావించకుండానే మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ శ్రీభాగ్ ఒప్పందంలో విశాఖపట్నం రాజధా నిగా ఉందని పేర్కొనడం ప్రజలను తప్పుతోవ పట్టించడమే అవుతుంది.అయినా శ్రీభాగ్ ఒప్పందం 80ఏళ్లకిందటి మాట. ఇప్పుడు ఆ ఒప్పందాన్ని నేటిరాజధాని ఎంపికతో ముడిపెట్టడం మొకాలికి, బోడుగుండుకి ముడివేసే ప్రయత్నం చేయడమే అవుతుంది.**



అన్నవరపు బ్రహ్మయ్య
సీనియర్ జర్నలిస్టు

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ విశాఖపట్నం ఏకైక రాజధానిగా ఉంటుందనడమే కాకుండా శ్రీభాగ్ ఒప్పందంలో విశాఖపట్నం ఆంధ్రరాజధానిగా నిర్ణయించారని వ్యాఖ్యానం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది.ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు ప్రస్తావన వస్తే ముందుగా గుర్తుకు వచ్చేది శ్రీభాగ్ ఒప్పందమే. అయితే నిజానికి శ్రీభాగ్ ఒప్పందంలో ప్రధానంగా ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన అంశంపైనే చర్చ జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరడంలో ఆంధ్రప్రాంత నాయకుల విభేధాలు తలెత్తకూడదనే లక్ష్యం 1937 నవంబరు 16వ తేదీన ఇరు ప్రాంతాల నాయకులు ఆంధ్రపత్రిక స్థాపకులు కాశీనాథుని నాగేశ్వరరావు ఇంట్లో సమావేశమయ్యారు. కాశీనాథుని నాగేశ్వరరావు భవనం పేరు శ్రీభాగ్. మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు సంబంధించి రాయలసీమ తీరప్రాంత జిల్లాలతో సహకరించాలంటే నెరవేర్చాల్సిన షరతులపై వీరు చర్చించారు. ఈ సమావేశంలో ఆనాటి ప్రముఖ నాయకులు కోటిరెడ్డి (కడప), కల్లూరు సుబ్బారావు (అనంతపురం), ఎల్. సుబ్బిరామిరెడ్డి (నెల్లూరు), కొండా వెంకటప్పయ్య (గుంటూరు), పట్టాభి సీతారామయ్య (మచిలీపట్నం), సీతారామిరెడ్డి (కర్నూలు), వెంకటప్పనాయుడు (నెల్లూరు) తదితరులు చర్చలో పాల్గొని ఒక ఒప్పందానికి వచ్చారు. దీనిని శ్రీభాగ్ ఒప్పందం అంటారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం, ఆ తర్వాత ఆంధ్ర ప్రాంతంలో చెలరేగిన అలజడి నేపథ్యంలో నాటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్పందించి 1952 డిసెంబరు 19వ తేదీన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కొత్త రాష్ట్రానికి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు విషయమై సాంకేతిక అంశాలను నిర్ణయించడానికి భారత ప్రభుత్వం నాడు రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న కె.ఎన్.వాంఛూను నియమించింది. ప్రధానమంత్రి ప్రకటన అనంతరం మాత్రమే రాజధాని నగరం గురించిన వార్తలు వెలువడ్డాయి. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదట రాజధానిగా విజయవాడనే నిర్ణయించారు. కాని, రాజధాని విజయవాడలో ఏర్పాటు చేయడం వల్ల ఒక సామాజికవర్గం ప్రాబల్యం పెరగడమేకాకుండా వారు ఆర్థికంగా స్థిరపడతారనే కారణంగా రాయలసీమలో ప్రబలంగా ఉన్న మరో సామాజికవర్గానికి చెందిన కొంతమంది ఆనాటి నాయకులు రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలని పట్టుపట్టారు. మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ముందుగా నిర్ణయించినట్లుగా విజయవాడ కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయడంలో వివిధ రాజకీయ కారణాలతోపాటు సామాజిక వర్గాల రాజకీయపోరు కూడా ఉందని నాడు ఆంధ్రపత్రికతో పాటు పలు పత్రికల్లో వార్తాకథనాలు వచ్చాయి.కారణాలు ఏమైనా ఆది నుంచి రాయలసీమ నేతలకు విజయవాడ పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. మద్రాసు నుంచి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా రాజధాని ఎంపిక నిమిత్తం చేసిన సర్కారియా కమిషన్ కూడా విజయవాడ పేరును రాజధానిగా సూచన చేసింది. కాని రాయలసీమ నేతలు విజయవాడ రాజధానిగా చేయడానికి ఏమాత్రం అంగీకరించకపోగా రాజధానిగా కర్నూలు పట్టణం పేరునుముందుకు తెచ్చారు. చివరకు రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై నాటి మద్రాసు రాష్ట్ర అసెంబ్లీలో ఓటింగ్ వరకు వచ్చింది. 1953 జులై 24న అసెంబ్లీలో విభజన చట్టానికి వివిధ పార్టీలు సవరణలు ప్రతిపాదించాయి. ఈ సవరణల్లో ప్రధానమైన అంశం రాజధాని మార్పునకు సంబంధించినదే. మద్రాసు అసెంబ్లీలోని తెలుగు శాసన




సభ్యుల వరకే ఓటింగులో పాల్గొనాలని సంజీవరెడ్డి చెప్పారు. అన్ని పార్టీలూ అదేమాటకు కట్టుబడి ఉండాలని ఉద్ఘాటించాయి. ఆనాటి మద్రాసు రాష్ట్రంలో తెలుగు శాసనసభ్యులు మొత్తం 138 మంది.గౌతులచ్చన్న తిరుపతి రాజధానిగా ప్రతిపాదించగా ఆయన సవరణకు అనుకూలంగా కేవలం 13మంది సభ్యులు మాత్రమే ఓటేయడంతో అది వీగిపోయింది. ఉత్తరాంధ్ర, సాలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కూనిశెట్టి వెంకటనారాయణ దొర కర్నూలు బదులు విశాఖ పట్టణాన్ని రాజధాని చేయాలని ప్రతిపాదించగా ఆ సవరణకు అనుకూలంగా 16ఓట్లు మాత్రమే వచ్చాయి. అదీ వీగిపోయినట్టు ప్రకటించారు. ఇక తరిమెల నాగిరెడ్డి విజయవాడ పేరును ప్రతిపాదించారు. వావిలాల గోపాలకృష్ణయ్య విజయవాడ, గుంటూరుల మధ్య రాజధాని ఉండాలని ప్రతిపాదించారు. చర్చ తర్వాత తరిమెల నాగిరెడ్డి తన ప్రతిపాదనను విరమించుకుని, వావిలాల ప్రతిపాదనకు మద్దతు ప్రకటించారు. వావిలాల ప్రతిపాదనపై ఓటింగ్ జరిగింది. వావిలాల సవరణకు అనుకూలంగా 62 మంది ఓటు వేశారు.వ్యతిరేకంగా 63మంది ఓటు వేశారు. వ్యతిరేకంగా చేసినవారిలో ఐదుగురు ఆంధ్రేతర ఎమ్మెల్యేలు ఉన్నారు. చెన్నపురికి చెందిన ఆంథోనీ పిళ్లై,హూసూరుకు చెందిన మునిరెడ్డి, విలాత్తిక్కులంకు చెందిన శల్లాదొరై, కేరళ ప్రాంతానికి చెందిన మరో ఇద్దరు అనాలోచితంగానో, ఉద్దేశపూర్వకంగానో ఓటింగులో పాల్గొన్నారు. వారిలో ఇద్దరు కాంగ్రెస్ వారు. ఒకరు సోషలిస్టు. ఒకరు ముస్లింలీగ్కు చెందినవారు. వారి ఓట్లను పరిగణనలోకి తీసుకోరాదని అన్ని పక్షాల నాయకులూ కోరారు. నిబంధనల ప్రకారం కేవలం ఆంధ్రప్రాంత సభ్యులు మాత్రమే ఓటింగులో పాల్గొనాల్సి ఉంది. అందువల్ల ఈ అయిదుగురు ఓట్లు మినహాయిస్తే వావిలాల ప్రతిపాదన విజయం సాధించిందని ప్రకటించాలి. కానీ స్పీకర్ వీరి వాదనలు పట్టించుకోకుండా వావిలాల సవరణ వీగిపోయినట్టుగా ప్రకటించారు.నాటి కమ్యూనిస్టు ఎమ్మెల్యే తరిమెల నాగిరెడ్డి, ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. వావిలాల సవరణకు ఓటేసిన వారిలో ఆంధ్ర నాయకులున్నారు. రాయలసీమ నాయకులున్నారు. ఉత్తరాంధ్ర వారూ ఉన్నారు. అర్హత లేని సభ్యుల ఓట్లను పరిగణనలోకి తీసుకుని నాటి మద్రాసు రాష్ట్రఅసెంబ్లీలో ఒక ఓటు తేడాతో రాజధాని విజయవాడ నుంచి కర్నూలుకు తరలివెళ్లింది అంటూ నాటి పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయి.తరిమిల నాగిరెడ్డి తదితర సభ్యులు రాజధాని విషయంలో ఉద్యమించాలని నిర్ణయించిన స్థితిలో నాటి ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ కోస్తానేతలను ఢిల్లీ పిలిపించి 'రాజధాని కోసం అంతగా పట్టుపట్టవద్దని' త్వరలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరుగుతుంది.అప్పుడు హైదరాబాద్ రాష్ట్రాన్ని, ఆంధ్రరాష్ట్రాన్ని విలీనంచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడుతుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది అని వివరించి,సమస్య జఠిలం కాకుండా చూశారు. ఆయన చెప్పినట్లుగా భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రాంతాలు కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దశాబ్దంపాటు సవ్యంగానే కొనసాగినప్పటికీ ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ వాదన ముందుకు వచ్చింది. ప్రత్యేక తెలంగాణ కోరుతూ 1969లో ఒక ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర కావాలంటూ 1972లో మరో ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమాలు సర్దుమణిగినా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోవడంతో మరల నూతన ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి రాజధాని ఎంపిక విషయంలో రకరకాల ప్రచారాలు జరిగినప్పటికీ నూతన రాష్ట్రానికి విజయవాడ- గుంటూరు నగరాలమధ్యలో అమరావతి పేరిట రాజధాని ఏర్పాటుచేస్తున్నట్టు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. నాటి సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎటువంటి సవరణ ప్రతిపాదించకుండానే సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఎటువంటి అభ్యంతరం తెలపని జగన్మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత మూడు రాజధానుల పేరిట 1953 నాటి రాయలసీమ నేతల రాజకీయాలను గుర్తు చేస్తూ మరల రాజధాని విషయం వివాదస్పదం చేశారు. ఈ విషయాలు ప్రస్తావించకుండానే మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ శ్రీభాగ్ ఒప్పందంలో విశాఖపట్నం రాజధానిగా ఉందని పేర్కొనడం ప్రజలను తప్పుతోవ పట్టించడమే అవుతుంది.అయినా శ్రీభాగ్ ఒప్పందం 80ఏళ్లకిందటి మాట. ఇప్పుడు ఆ ఒప్పందాన్ని నేటిరాజధాని ఎంపికతో ముడిపెట్టడం మొకాలికి, బోడుగుండుకి ముడివేసే ప్రయత్నం చేయడమే అవుతుంది. ●

# కొవిడ్ తర్వాత విద్యావ్యవస్థలో కొత్త సవాళ్లు

**పి.శ్రీలక్ష్మి**

కరోనా మహమ్మారి ప్రభావం ముగిసింది. కానీ అందుకు సంబంధించిన ప్రభావం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.ముఖ్యంగా ప్రపంచ దేశాల్లోని పాఠశాల విద్యపై దాని ప్రభావం మరింతగా కనిపిస్తోంది. ఇది పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల్లో సున్నితత్వం, క్రమశిక్షణ లేకపోవడమే కాకుండా హింసాత్మక ప్రవర్తన కూడా పెరిగింది. తల్లిదండ్రులు ఈ మార్పు గురించి తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యలో నెలకొన్న ఈ స్తబ్దత ప్రభుత్వం, రాజకీయ నాయకులు మేల్కొవడానికి కారణం కావాలి. కానీ ఇది జరగడం లేదు. మీరా లెవిన్సన్, గత సంవత్సరం అట్లాంటిక్‌లో ప్రచురించిన వారి వ్యాసంలో ఇలా రాశారు.'కరోనా వైరస్ ఇప్పటి వరకు అమెరికన్ విద్యాచరిత్రలో అతిపెద్ద అంతరాయం కలిగించింది' అమెరికా ప్రజలపై కొవిడ్ పట్టు సడలించినా కానీ పాఠశాల విద్యసాధారణ స్థితికి రాలేదు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రవర్తనలో మరిన్ని మార్పులు చోటు చేసుకున్నాయి.పాఠశాలల్లో హాజరు నమోదు తగ్గుదల ఇందుకు నిదర్శనం. కొవిడ్‌కిముందు మొత్తం విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లలో 11 లక్షల మేరతగ్గాయి.ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరని ఈ పిల్లల్లో 26 శాతం మంది ఇంటి విద్యను ఇష్టపడుతుండగా, 14 శాతం మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చేరారని ఒక పరిశోధనలో తేలింది. మిగిలిన 34 శాతం మంది పిల్లలను గుర్తించడం కష్టంగా మారింది. వారిలో చాలామంది బడి మానేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. రాబోయే సంవత్సరాల్లో జననాల రేటు తగ్గడంవల్ల పాఠశాలల్లో నమోదు కూడా తగ్గిపోతుందని, ఆ నిష్పత్తిలో విద్యారంగానికి ప్రభుత్వం ఇచ్చే నిధులు కూడా తగ్గిపోతాయని అమెరికా విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇది విద్యారంగంలో పతనానికి దారితీస్తుంది. 1970 సంవత్సరంలో నేషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రెస్‌ను ప్రవేశపెట్టినప్పుడు ఆ స్కోర్ పెరిగింది. అయితే గణితంలో బాగా స్కోర్ చేసిన తొమ్మిదేళ్ల పిల్లలకు, మహమ్మారి వారి అవకాశాలను దెబ్బతీసిందని, విద్యానైపుణ్యాల క్షీణత దీర్ఘకాలిక పరిణామాలను కలిగి ఉంటుందని, గణిత నైపుణ్యాలను కోల్పోవడం వల్లనే పిల్లల భవిష్యత్తు, ఆదాయం తొమ్మిది ట్రిలియన్ డాలర్లు తగ్గిపోతుందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ కారణంగా పాఠశాల విద్యార్థుల్లో గైర్హాజరు ధోరణి పెరిగింది. కొవిడ్ సమయంలో పిల్లలు పాఠశాలకు వెళ్లడం లేదు.ఒక అంచనా ప్రకారం 2021-22 అకడమిక్ సెషన్‌లో 16 కోట్ల మంది విద్యార్థులు చాలాకాలం పాటు పాఠశాలలకు గైర్హాజరయ్యారు. ఆ సమయంలో న్యూయార్క్ నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 41 శాతం మంది విద్యార్థులు దీర్ఘకాలికంగా గైర్హాజరైనట్లు గుర్తించారు. ఇది క్రమశిక్షణలో సమస్యలను కూడా పెంచింది. 80శాతానికి పైగా ప్రభుత్వ పాఠశాలలు మహమ్మారి కారణంగా విద్యార్థుల ప్రవర్తన అధ్వాన్నంగా మారిందని,వారిలో సున్నితత్వం తగ్గిందని గుర్తించారు. కొవిడ్ అసమానతలను కూడా పెంచింది. రాబిన్ లేక్, ట్రావిస్ పిల్లో బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూట్ కథనంలో రాసినట్లుగా 'అమెరికన్ల విద్యార్థుల సంఖ్య పెంచారు. దీనిలో ఎక్కువ, తక్కువ స్కోరింగ్ చేసే విద్యార్థుల మధ్య అంతరం చాలా పెరిగింది. పాఠశాల విద్యార్థుల్లో వచ్చిన ఈ మార్పులను తల్లిదండ్రులు తెలుసుకుని, తదనుగుణంగా తమ ఆలోచనలను సర్దుబాటు చేసుకున్నారు.అమెరికా చరిత్రలో విద్య విషయానికి వస్తే అమెరికన్ ఓటర్లు డెమొక్రాట్‌లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. కానీ నేట్ మల్కస్ నేషనల్ అఫైర్స్‌లో 2022 సంవత్సరం నుండి అమెరికన్ ఓటర్లు విద్యా విషయాలలో డెమొక్రాట్‌ల వలె రిపబ్లికన్‌లను విశ్వసించడం ప్రారంభించారనిరాశారు.అంటే ప్రస్తుత విద్యాపరిస్థితి తల్లిదండ్రులను పునరాలోచనలో పడేలా చేసింది.కానీ రాజకీయ నాయకత్వం మాత్రం దాని గురించి ఆలోచించకపోవడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. అటువంటి పరిస్థితిలో పాఠశాల విద్య అమెరికాలో అత్యంత సమస్యగా మారింది. దానిని తిరిగి చక్కదిద్దడానికి అధ్యక్షుడు బిడెన్ ఒక ప్రణాళికను ప్రకటించాల్సి ఉంది. కానీ ఇలాంటిదేమీ జరగలేదు. బిడెన్ తన స్టేట్ ఆఫ్ యూనియన్ ప్రసంగంలో అలాంటిదేమీ చెప్పలేదు. పాఠశాల విద్యాసంస్కరణల విషయంలోనూ రిపబ్లికన్ పార్టీ జాతి ఆధిపత్యం గురించి మాట్లాడుతుంది. పాఠశాల విద్యలో ఈ స్తబ్దత అమెరికా రాజకీయాలకు ఆందోళన కలిగించే సమయం.అందరికీ ఛార్టర్లు, వోచర్లు, బాత్‌రూమ్‌లు వంటి కొట్టుమిట్టాడుతున్న సమస్యల గురించి చర్చించే బదులు దేశంలో విద్యారంగాన్ని ఎలా మెరుగుపరుచుకోవాలో ఆలోచిద్దాం అని నాయకులు నిలబడి చెప్పడం అవసరం. ఒక సర్వేలో 40శాతం కంటే ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీసం వారానికి ఒక రోజు ఇంటిలో నేర్చుకునే అవకాశం ఉందని చెప్పారు.ఈ ఆలోచన వస్తేపాఠశాల పాఠ్యాంశాలను మార్చాల్సి ఉంటుంది.పాఠశాలలో విద్యార్థులకు ఒక గంటపాటు ఒక సబ్జెక్టు మాత్రమే బోధించే బదులు వారికి నచ్చిన సబ్జెక్టును చదవమని కొందరు ఈ దిశగా ఆలోచిస్తున్నారు. కొన్ని పాఠశాలలు చిన్న చిన్న గ్రూపులుగా విభజించి మొత్తం తరగతికి బదులు చిన్న తరగతిలో ఒక పిల్లవాడికి బోధించే ప్రయోగాలు చేస్తున్నాయి. ●

# రిజర్వేషన్ల అమలులో వ్యత్యాసమెందుకు?

**కె.శ్రవణకుమార్**

భారతదేశంలో కులాల ప్రస్తావన ఈనాటిది కాదు. కులం వేర్లు బలంగా నాటుకుపోయిన సమాజం మనది. నేడు దేశంలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా కులం పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. దేశ జనాభాలో సగానికి పైగా జనాభా కులం ఆధారంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనక్కి నెట్టివేయబడ్డారు. తీవ్రమైన వివక్షను ఎదుర్కొన్నారు. అట్టి ప్రజానీకానికి స్వాంతన చేకూర్చే ఉద్దేశంతో రిజర్వేషన్స్ అనే అంశాన్ని తెరపైకి తెచ్చారు నాటి నాయకులు. అందులో భాగంగానే మొదట షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు రిజర్వేషన్స్ కల్పించారు. తర్వాత కాలంలో వెనుకబడిన తరగతులకు, తాజాగా అగ్రకుల పేదలకు రిజర్వేషన్స్ కల్పించడం జరిగింది. అంతా బాగానే ఉన్నప్పటికీ తాజాగా చేసిన 103వ రాజ్యాంగ సవరణ చట్టం 2019 ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం చర్చనీయాంశం అయింది. దేశ జనాభాలో 10 శాతం ఉన్న అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్స్ అమలు చేస్తున్నప్పుడు దేశ జనాభాలో 56 శాతం ఉన్న బిసిలకు మాత్రం 27శాతం రిజర్వేషన్స్ అమలు చేయడం అత్యంత శోచనీయం. ఇది తీవ్రంగా విభేదించాల్సిన అంశం. జనాభా దామాషా ప్రకారం బిసిలకు 56 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలి. కానీ ప్రభుత్వాలు బిసిలను నిర్లక్ష్యం చేస్తూ ఆర్థికంగా, రాజకీయంగా వివక్షకు గురి చేస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం జరగాల్సిన జనాభా లెక్కల ప్రక్రియ కులాల ఆధారంగా జరగాలని వెనుకబడిన వర్గాలలో బుద్ధిజీవులడిమాండ్. ముఖ్యంగా బిసిలు అనే పేరుతో వ్యవహరిస్తున్న బ్యాక్వర్డ్ క్లాసెస్‌లో ఎన్ని రకాల కులాలున్నాయి? ఒక్కో కులంలో ఎంత జనాభా ఉంది? అసలు వారి స్థితిగతులు ఎలాఉన్నాయి? వారికి అందాల్సిన అవకాశాలు అందుతున్నాయా? లేదా? ప్రభుత్వాల అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారికి ఏవిధంగా లబ్ధి చేకూరుస్తున్నాయి. వారి జీవన స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయి! విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు అందుతున్నాయా లేదా అనే అంశాలు కేవలం బిసి జనగణన ద్వారా మాత్రమే సంక్షిప్తంగా తెలుసుకునే వీలుంటుంది. కావున ప్రభుత్వాలు బిసిల గణన




డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని ఈసారి జరగబోయే జనాభా లెక్కలను కుల ఆధారితంగా జరపాలి. బీహార్ లాంటి రాష్ట్రాలు అన్ని వర్గాలలోని పేద ప్రజలకు, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు శాస్త్రీయ పద్ధతిలో అర్హత కలిగిన వారికి అందాలనే ఉద్దేశంతో కులాల వారీగా జనగణన ప్రారంభించింది. దీని ద్వారా వెనుకబడిన వర్గాల ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకొని వారిని మరింత వృద్ధిలోకి తీసుకురావాలనేది నితీష్ ప్రభుత్వం ఆలోచన. దేశంలో చివరిగా 1931లో కులాల వారీగా జనగణన జరిగింది. ఆ లెక్కలనే స్వాతంత్ర్యానంతరం ప్రజల సంక్షేమ పథకాలకు ప్రభుత్వాలు ఉపయోగించాయి.1979లో జనతా ప్రభుత్వం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి వారి జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు బిందేశ్వరి ప్రసాద్ మండల్ నేతృత్వంలో ఒక కమిషన్ నియమించింది.1980లో ఈ కమిషన్ నివేదిక సమర్పించింది.దానిలో దేశంలో వెనుకబడిన వర్గాలప్రజలు 52 శాతంగా పేర్కొంది. వారి జీవనస్థితిగతులు మారేందుకు ఆ వర్గాల ప్రజలకు రాజకీయంగా, విద్య, ఉద్యోగ అవకాశాలలో 27 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందిగా పేర్కొంది. కానీఆనాటి రాజకీయ అస్థిరత కారణంగా ఈ కమిషన్ ఇచ్చిన నివేదిక కార్యరూపం దాల్చలేదు. 1992లో బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ పరంగా 27 శాతం రిజర్వేషన్స్ కల్పించడం జరిగింది. జనాభా దామాషా ప్రకారం బిసిలకు దక్కాల్సిన అవకాశాలు ప్రభుత్వాలు కల్పించాలి. బిసి కులగణన జరిపి విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాలలో బిసిలకు దక్కాల్సిన అవకాశాలను కల్పించాలి.ఇప్పటికీ బిసిలు వెనుకబడిన వర్గాలుగానే మిగిలిపోవడానికి కారణం ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళిక లేకపోవడం. బిసిల జీవనస్థితిగతులకు సంబంధించిన సమాచారం అసంపూర్ణంగా ఉంది. కాబట్టి బిసిల లెక్కలు తేలాలి. అవకాశాలలో వారివాటా వారికివ్వాలి. ఇప్పటికే కేంద్రంలోని ప్రభుత్వాల జాప్యం కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు బిసిలు.బిసి కులగణన ఆలస్యం అయ్యే కొద్దీ వెనుక బడిన వర్గాల నుండి తీవ్రఆగ్రహం ఎదుర్కోవాల్సి ఉంటుందన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలి. జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు దేశ ఆర్థికరంగానికి వారి కులవృత్తుల ద్వారావెన్నుదన్నుగా ఉన్నారు. అలాంటి ప్రజలను నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానంగా వచ్చే పరిస్థితులు తీవ్రంగాఉంటాయి.దేశ జనాభా లో 56 శాతం ఉన్న బిసిలకు 27శాతం రిజర్వేషన్స్ అంటే 10శాతం ఉన్న అగ్రకుల పేదలకు మాత్రం 10శాతంరిజర్వేషన్స్ ఏ విధంగా సమర్థనీయమో అందరూఆలోచించాలి.ముఖ్యంగా బిసిలు ఈ విషయంలో పోరాటం తీవ్రతరంచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.●

# యేడాదిగా ఎటుచూసినా విధ్వంసమే

## 7వేల మంది మృత్యుఒడిలోకి



**మాస్కో, ఫిబ్రవరి 21:** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రారంభించి యేడాది కావస్తోంది. ఫిబ్రవరి 24, 2022 తెల్లవారుజామున సైనికచర్య ప్రారంభమైంది. ఈ చర్యతో ప్రపంచదేశాలు ఉలిక్కిపడ్డాయి. కొద్ది రోజుల్లో ముగుస్తుందిలే అనుకున్న ఆ దాడికి యేడాది పూర్తవుతున్నా, ముగింపు మాత్రం దొరడం లేదు. ఈ క్రమంలో ఎన్నో బాంబులు మోగాయి. క్షిపణులు పేలాయి. ఇళ్లు, జీవితాలు కూలాయి. అప్పటికే ఆఫ్గానిస్థాన్ మానవ సంక్షోభంతో తల్లడిల్లిన అంతర్జాతీయ సమాజం ముందు ఉక్రెయిన్ సంక్షోభం వచ్చిపడింది. ఈ యుద్ధం కారణంగా ఇప్పటి వరకూ ఉక్రెయిన్‌లో వేల సంఖ్యలో సామాన్య ప్రజలు ప్రాణాలు వదిలారు. సుమారు 80 లక్షల మంది సొంత ప్రాంతాలను వీడారు. అన్నింటిని వదిలి కొందరు దేశం దాటగా, మరికొందరు స్వదేశంలోనే కాస్త సురక్షిత ప్రాంతానికి వెళ్లారు. ఇలా వెళ్లే క్రమంలో గమ్యం చేరుకోకముందే బాంబుల మోతలో కొందరు మరణించారు. పరాయి దేశం వెళ్లిన యువతుల అక్రమ రవాణా గురించి వార్తలు వినిపించాయి. ఇంకా దారుణం ఏంటంటే, మగవారు యుద్ధం కోసం ఉక్రెయిన్‌లో ఉండిపోతే వారిని వదల్లేక, వారిని మళ్లీ చూస్తామో లేదోనని కుటుంబసభ్యులు దుఃఖించిన దృశ్యాలు ఇంకా ఎవరూ మరవనేలేదు. ఈ క్రమంలో యుద్ధం రెండో యేడాది కొనసాగేలా కనిపిస్తోంది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ గణాంకాల ప్రకా రం, ఫిబ్రవరి 13 వరకు ఉక్రెయిన్‌లో 7,199 మంది సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 11,800 మంది గాయపడ్డారు. ఈ యుద్ధంతో సరఫరా గొలుసు దెబ్బతిన్నది. దాంతో అంతర్జాతీయగా ఆహార, ఇంధన ధరలు భారీగా పెరిగాయి. ఇప్పుడు ప్రపంచంలో నెలకొన్న మాంద్యం భయాలకు ఈ యుద్ధమే కీలక కారణం. ఇక రోజుల్లో ముగుస్తుందనుకున్న యుద్ధం ఇన్ని నెలలు కొనసాగడానికి ప్రధాన కారణం అమెరికా దాని మిత్రదేశాల నుంచి ఉక్రెయిన్‌కు అందుతున్న భారీ సాయము. ఇప్పటి వరకు ఒక్క అమెరికానే 50 బిలియన్ డాలర్ల ఆర్థిక మద్దతు ఇచ్చింది ఇంకా ఇస్తామంటూ తాజా కీవ్ పర్యటనలో అధ్యక్షుడు బైడెన్ హామీ ఇచ్చారు. యుకే, జర్మనీ, కెనడా తదితర దేశాలు తమ వంతు సహకారం అందిస్తున్నాయి. ఇదిలా ఉండగా, రానున్న రోజుల్లో దాడుల పరంగా రష్యా మరింత దూకుడు పెంచొచ్చని అంచనాలు వెలువడు తున్నాయి. మరోవైపు ఎలాంటి దాడులనైనా ఎదుర్కోవడానికి తాము సిద్ధమని, రష్యా ఆధీనంలోని ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఉక్రెయిన్ చెబుతోంది.

# 26/11 ఉగ్రవాదులు

## లాహోర్‌లోనే తిరుగుతున్నారు జావెద్ అక్తర్




**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 21:** ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జావెద్ అక్తర్ పాకిస్థాన్‌ను ఆ దేశంలోనే విమర్శించారు. 26/11 ముంబై ఉగ్రపేలుళ్ల ఘటనను గుర్తుచేసుకున్న ఆయన, ఆ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా లాహోర్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారంటూ దుయ్యబట్టారు. ఇందుకు సంబంధించిన విడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రముఖ ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ స్మారకార్థం ఇటీవల లాహోర్‌లో ఫైజ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జావెద్ అక్తర్‌కు ఆహ్వానం లభించడంతో ఆయన పాక్‌లో పర్యటించారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆయన, అక్కడ విలేకరులతో మాట్లాడుతూ భారత్-పాక్ సంబంధాలు, ముంబై ఉగ్రవాదుల ఘటనను ప్రస్తావించారు. 'ఒకరిపై ఒకరు నిందలు వేసుకున్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. పైగా ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. వాటిని తగ్గించాల్సిన అవసరముంది. మేం ముంబైకి చెందిన వాళ్లం. మా నగరంలో ఉగ్రవాదులు ఎంతటి భీభత్సాన్ని సృష్టించారో మా కళ్లారా చూశాం. వారు నార్వే లేదా ఈజిప్టు నుంచి వచ్చిన వారు కాదు. వాళ్లు ఇంకా మీ దేశంలోనే స్వేచ్ఛగా తిరుగుతున్నారు కదా. అలాంటప్పుడు భారత్ దాని గురించి ఫిర్యాదులు చేసినప్పుడు మీరు దాన్ని ప్రతికూలంగా తీసుకోవాల్సిన అవసరం లేదు'అని అక్తర్ వ్యాఖ్యానించారు.ఇ క భారత ఆర్టిస్టులను పాక్‌లో గౌరవించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. 'నుశ్రత్ ఫతే అలీ ఖాన్, మెహదీ హాసన్ లాంటి పాక్ కళాకారుల గౌరవార్థం మేం పెద్ద కార్యక్రమాలు చేపడుతున్నాం. కానీ లతా మంగేష్కర్ కోసం పాక్ ఎప్పుడైనా ఫంక్షన్ ఏర్పాటు చేసిందా?' అని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విడియోలను కొందు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ప్రస్తుతం ఆ విడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 2008 నవంబరు 26న పాక్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థకు చెందిన 10 మంది ముష్కరులు ముంబైలోకి చొరబడి నరమేధం సృష్టించిన విషయం విదితమే.

ఈ ఘటనలో 166 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడుల్లో 9 మంది ఉగ్రవాదులను భద్రతా సిబ్బంది హతమార్చారు. మరో ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను ప్రాణాలతో పట్టుకోగా, నాలుగేళ్ల తర్వాత 2012లో అతడిని ఉరితీశారు.

# వృద్ధులకు రూ.3 వేల పెన్షన్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్

## నాగాలాండ్‌లో కాంగ్రెస్ ఎన్నికల హామీ



**కోహిమా, ఫిబ్రవరి 21:**నాగాలాండ్‌లో శాంతి, సుస్థిరత, సర్వతోముఖాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. నాగాలాండ్‌లోని దిపూపార్ గ్రామం పబ్లిక్ గ్రౌండ్స్‌లో జరిగిన ఎన్నికల ప్రచారసభలో ఖర్గే ప్రసంగించారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. నాగాలాండ్‌ను గత 20 యేళ్లుగా ఎన్‌డిపిపి,ఎన్‌పిఎఫ్, బిజెపి దోచుకున్నాయని ఖర్గే ఆరోపించారు. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారని, క్రిష్టియన్లపై దాడులు జరుగుతున్నాయని.. మతం, కులం పేరుతో ప్రజలను విడగొడుతున్నారని ఆయన విమర్శించారు. గత తొమ్మిదేళ్ల మోడీ పాలనలో దేశంలో విద్వేషాలు, భయాలతో కూడిన వాతావరణం నెలకొన్నదన్నారు. ఈశాన్య నాగాలాండ్‌లో శాంతి, సుస్థిర అభివృద్ధికి కాంగ్రెస్ అన్ని చర్యలు తీసుకుంటుందని ఖర్గే హామీ ఇచ్చారు. ఇప్పుడు జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే..వృద్ధులకు నెలకు రూ.3000 చొప్పున పెన్షన్ ఇస్తామని, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, గ్రామీణ ఉపాధిహామీ కార్డుదారులందరికీ 100 శాతం చెల్లింపులు జరిగేలా చూస్తామని, ఉన్నత విద్య కోసం విద్యార్థులకు జీరో వడ్డీతో రుణాలు అందిస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. మొత్తం 60మంది సభ్యులుండే నాగాలాండ్ అసెంబ్లీకి ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 2న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

# కర్నాటకలో ఫోటోల వివాదంలో చిక్కుకున్న ఇద్దరు మహిళా అధికారులపై బదిలీ వేటు



**బెంగళూర్, ఫిబ్రవరి 21:** సోషల్ మీడియాలో ఫోటోలు పోస్ట్ చేసి వివాదానికి కారణమైన మహిళా ఉన్నతాధికారులపై కర్నాటక ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇద్దరు మహిళా అధికారులను ప్రస్తుత స్థానాల నుంచి బదిలీ చేసింది. ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఫేస్‌బుక్‌లో ఫోటోలు పోస్ట్ చేసిన ఐపిఎస్ అధికారిణి రూపా మౌద్గిల్‌తోపాటు ఆమె భర్త మునీశ్ మౌద్గిల్‌ను కూడా బదిలీ చేసింది. ఇప్పటివరకూ రెవెన్యూ విభాగంలో కమిషనర్‌గా పని చేసిన ఆయణ్ని డిపిఎఆర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది. ఇద్దరు మహిళా అధికారులపై చర్యలుంటాయని ఆ రాష్ట్ర హోంమంత్రి అరగా జ్ఞానేంద్ర సోమవారం హెచ్చరించగా..మరుసటి రోజే(మంగళవారం) వారిని బదిలీ చేయడం గమనార్హం. ఐఎఎస్ అధికారిణి రోహిణీ సింధూరీ ఫోటోలను ఐపిఎస్ అధికారిణి రూపా డి. మౌద్గిల్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేయడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. రెచ్చగొట్టేలా ఉన్న ఆ ఫోటోలను గతంలో సింధూరీనే ముగ్గురు మగ ఐఎఎస్ అధికారులకు షేర్ చేశారని రూపా ఆరోపించారు. రూపా ఆరోపణలపై స్పందించిన సింధూరీ..ఆమె మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు, నిరాధార ఆరోపణలు చేస్తున్నార్ను అంటూ ఎద్దేవా చేశారు. ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందితాశర్మకు ఇరువురు అధికారులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. ఈ పరిణామాలపై స్పందించిన ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై..అఖిలభారత సర్వీస్ నిబంధనలకు కట్టుబడి ఉండాలంటూ ఇద్దరు అధికారులకూ సూచించారు. వీరిద్దరి విషయంలో సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించిన కర్నాటక ప్రభుత్వం ప్రస్తుతానికి బదిలీ వేటు వేసింది. తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది.

# నడిరోడ్డుపై మహిళపై కత్తులతో దాడి

**చండీగఢ్, ఫిబ్రవరి 21:** పంజాబ్ ఫిరోజ్‌పుర్‌లోని బజ్ చౌక్‌లో అత్యంత దారుణ ఘటన వెలుగుచూసింది. 50యేళ్ల మహిళపై నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. బైక్‌పై వచ్చి పట్టపగలే నడిరోడ్డుపై ఈ కిరాతక చర్యకు పాల్పడ్డారు. పోలీసులు అక్కడే ఉన్నా ఏమీ చేయలేక భయంతో పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన విడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన మహిళ రోడ్డుపైనే కుప్పకూలింది. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే ఈమె ఓ హత్య కేసుకు సంబంధించి కోర్టులో వాంగ్మూలం ఇచ్చి ఇంటికి తిరిగివస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే నలుగురు వ్యక్తులు వెనకాల నుంచి దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఓ నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. మహిళపై దాడి జరిగినప్పుడు ఇద్దరు పోలీసులు కత్తులు చూసి భయంతో వారు వాహనంలో పారిపోయారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

# ప్రపంచదేశాల్లో 67.81 కోట్లకు పెరిగిన వైరస్ కేసులు

## 67.91 లక్షలకు చేరుకున్న మరణాలు

జెనీవా, ఫిబ్రవరి 21: ప్రపంచదేశాల్లోకరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్తకేసులతోనే చిన్న దేశాలు మరింతగా సతమతం అవుతున్నాయి. ప్రపంచదేశాల్లో మంగళవారం నాటికి మొత్తం 67.81 కోట్లమందికికరోనాసోకి వారిలో 67.91 లక్షలమందిచనిపోయారు. మరో 40,677 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 65.15 కోట్లకుపైగా నమోదు కాగా మరో 2.04 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతో పోరాటంచేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.58 కోట్లమందికి కరోనాసోకి వారిలో 20.14 లక్షలమంది చనిపోయారు. మరో 6455 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.14కోట్లకుపైగా నమోదుకాగా మరో 23.85 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 12.43 కోట్లకుపైగా నమోదుకాగా మరో 16.08 లక్షలమందిచనిపోయారు. మరో 7813 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 11.95 కోట్లకుపైగా నమోదుకాగా మరో 31.78 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 21.40కోట్లమందికి కరోనాసోకి వారిలో 15.35 లక్షలమందిచనిపోయారు. మరో 15,582 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 19.86 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.38 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.79 కోట్లమందికి కరోనాసోకి వారిలో 13.49 లక్షలమంది చనిపోయారు. మరో 10,209 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 6.61 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,47,760 మందిపరిస్థితి విషమించింది. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.28 కోట్లకుపైగా కరోనా బాదితులుంటే వారిలో 2,58,570 మందిచనిపోయారు. రికవరీలు 12.07 కోట్లవరకూ ఉన్నాయి.మరో 4,57,760 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. 19 ద్వీపకల్పదేశాలపరంగాచూస్తే మొత్తం 1.39 కోట్లకుపైగా కరోనాబాధితులుంటే వారిలో 25,968 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 1.38 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1,19,492 మందిపరిస్థితి మరింతగా విషమించింది.

# ఒక్కరోజులో కరోనా కేసులు 95

## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,46,85,132

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి21:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 95 కేసులు నమోదయ్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,46,85,132కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,41,52,450 మంది కోలుకోగా 1921 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,30,761కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.81 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,37,409కి చేరగా,79,88,875 మంది వరకు కోలుకున్నారు. 1,48,421మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 68,30,405కి చేరింది.అందులో 67,57,566మంది కోలుకున్నారు. 71,581మంది మరణించారు. కర్ణాటకలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 40,73,443చేరింది. అందులో 40, 32,963మంది కోలుకున్నారు. 40,310మంది మరణించారు. తమిళనాడులో కరోనా బాధితుల సంఖ్య35,94,782కి చేరింది.అందులో 35,56,683 మంది కోలుకున్నారు. 38,049 మంది మరణించారు.



# టర్కీలో మరోసారి భారీ భూకంపం

## ముగ్గురు మృతి, 200 మందికిపైగా గాయాలు

ఇస్తాంబుల్, ఫిబ్రవరి21: రెండు వారాల కిందట సంభవించిన భారీ భూకంపం ధాటికి అతలాకుతలమైన తుర్కియేలో మరోసారి భూకంపం వచ్చింది. హతాయ్ ప్రావిన్సులో శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.4 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు యూరోపియన్ మెడిటేరియన్ సిస్మాలాజికల్ సెంటర్ తెలిపింది. తుర్కియే విపత్తు నిర్వహణ సంస్థ కూడా దీనిని ధృవీకరించింది. భూకంప కేంద్రం దక్షిణ టర్కీ నగరం అంటాక్యా సమీపంలోని 10 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు గుర్తించారు. దీని ప్రభావం సిరియా, ఈజిప్టు, లెబనాన్‌లోనూ కనిపించింది. తాజా భూకంపం కారణంగా ఇప్పటికే బలహీనపడిన భవనాలు కూలిపోయాయి. హతాయే మేయర్ లుత్ఫు సవస్ మాట్లాడుతూ ఇప్పటికే బలహీనపడిన కొన్ని భవనాలు కూలిపోయి శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు నివేదికలు అందాయన్నారు. ఇప్పటి వరకు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, 200 మంది గాయపడ్డారని టర్కీ హోంశాఖ మంత్రి సులేమాన్ సోయ్‌లూ చెప్పారు. టర్కీ విపత్తు నిర్వహణ సంస్థ మాత్రం ఒకరు మాత్రమే చనిపోయారని, చాలా భవనాలు కూలిపోయినట్లు స్థానికులు చెప్పినా రెండు వారాల కిందట సంభవించిన భూకంపం తర్వాత భయంతో పట్టణవాసులు వేరే చోటకు వెళ్లిపోయారని చెప్పింది. భూమి మళ్లీ కంపించడం మొదలైనప్పుడు నా కాళ్ల కింద భూమి చీలిపోతుందని నేను అనుకున్నాను అని సెంట్రల్ అంటాక్యాకు చెందిన మునా అల్ ఒమర్ అనే ఓ మహిళ కన్నీరు పెట్టుకుంది. ఓ పార్కులో టెంట్ వేసుకుని తన ఏడేళ్ల కుమారుడితో బిక్కుబిక్కుమని గడుపుతోంది. ఇక ఫిబ్రవరి 6న సంభవించిన భూకంపం కారణంగా టర్కీ, సిరియాలో 47 వేల మందికిపైగా మృతి చెందారు. ఒక్క టర్కీలో 41,156 మంది ప్రాణాలు కోల్పోగా లక్షల మంది గాయపడ్డారు. 3,85,000 భవనాలు కూలిపోయాయి. భూకంపంతో అతలాకుతలమైన టర్కీకి ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం అందిస్తున్నాయి. సహాయక చర్యల కోసం బలగాలను పంపి సామగ్రిని కూడా అందచేస్తున్నాయి. భారత్ నుంచి ఎమర్జెన్సీ సిబ్బంది, వైద్యబృందాలు, ఎన్‌డిఆర్‌ఎఫ్ టీమ్స్ టర్కీలోని దక్షిణ ప్రాంతానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. కాగా, భూకంపం బాధితుల్లో 3,56,000 మంది గర్భిణులు ఉన్నారని, వారికి అత్యవసర వైద్యసేవలు అందచేయాల్సిన అవసరముందని ఐక్యరాజ్యసమితి లింగ, పునరుత్పత్తి ఆరోగ్య విభాగం పేర్కొంది. టర్కీలో 226,000, సిరియాలో 130,000 మంది గర్భిణిలు ఉండగా వీరిలో 38,800 మందికి వచ్చే నెలలో ప్రసవాలు జరగనున్నాయి. చాలా మంది సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఓ వైపు శీతల వాతావరణం, మరోవైపు సరైన ఆహారం, తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

# చైనా ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యాకు మద్దతిస్తే జరిగేది ప్రపంచ యుద్ధమే జెలెన్‌స్కీ

**మాస్కో, ఫిబ్రవరి 21:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చైనాను హెచ్చరించారు. ఆయన ఓ ఇంటర్వ్యూ ఇస్తూ ఒకవేళ చైనా ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యాకు మద్దతు ప్రకటిస్తే ఇది ప్రపంచ యుద్ధాన్ని తెచ్చేందుకు కారణమవు తుందని పేర్కొన్నారు. ఆ దేశం రష్యాకు మద్దతు ప్రకటించకుండా ఉండడం తమకు చాలా ముఖ్యమని చెప్పారు. చైనా తమ పక్షాన ఉండాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పిన ఆయన, కానీ అది సాధ్యంకాకపోవచ్చని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇక్కడేం జరుగుతోం దన్న దానిపై చైనా ఆచరణాత్మక విశ్లేషణ చేసుకోవాలని కోరారు.



ఎందుకంటే చైనా రష్యాతో జట్టుకడితే ప్రపంచ యుద్ధం జరిగే పరిస్థితి వస్తుందన్నారు. ఈ విషయం ఆ దేశానికీ తెలుసునని పేర్కొన్నారు. మాల్డోవా అంశాన్ని జెలెన్‌స్కీ ప్రస్తావిస్తూ తనకు అందిన ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఆ దేశ అధ్యక్షురాలు మైయ సందుకు అందచేసినట్లు వెల్లడించారు. అక్కడ రష్యా అనుకూల వర్గాల తిరుగుబాటుకు యత్నిస్తున్నాయని చెప్పారు. అందుకు ఆమె ధన్యవాదాల తెలిపిందన్నారు. మాల్డోవా రక్షణకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. గత వారం అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మ్యూనిక్ రక్షణ సదస్సులో చైనా దౌత్యవేత్త వాంగ్‌యీను హెచ్చరించారు. చైనా నుంచి రష్యాకు పరికరాల సాయం చేసిన వారు పరిణామాలు అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బీజింగ్ నుంచి మాస్కోకు ఆయుధాలు వెళతాయని అమెరికా ఆందోళన చెందుతోంది. ఈ సమయంలో జెలెన్‌స్కీ హెచ్చరికలు రావడం విశేషం.



# బైడెన్ ఉక్రెయిన్ టూర్‌కు సీక్రెట్ ప్లానింగ్!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** ఉక్రెయిన్‌లో శీతాకాలం మంచుతెరలు మెల్లగా వీగిపోతున్నాయి. రష్యా దాడి మొదలై దాదాపు ఏడాది కావస్తోంది. హిమపాతం కారణంగా మందగించిన రష్యా దాడులు మళ్లీ ఊపందుకొంటున్నాయి. ఈ సమయంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. రగులుతున్న యుద్ధక్షేత్రంలో అమెరికా అధ్యక్షుడు పర్యటించడం అత్యంతి రిస్క్‌తో కూడుకున్న పని. వాస్తవానికి ఈ పర్యటన వెనుక అమెరికాలోని అత్యంత సీనియర్ అధికారుల కొన్ని నెలల ప్లానింగ్ ఉంది. బైడెన్ ఉక్రెయిన్ పర్యటన శ్వేత సౌధం అత్యంత రహస్యంగా ఉంచింది. ఎందుకంటే ఆయన ప్రయాణించే మార్గంలోని గగనతలంపై నియంత్రణ వారి చేతుల్లో లేదు. దీంతో రహస్య ప్లానింగ్ ప్రకరారం బైడెన్ ప్రయాణ తేదీ దగ్గర పడేకొద్ది సీనియర్ అధికారులు ఉక్రెయిన్ ట్రిప్ ప్లానింగ్ కొట్టిపారేస్తూ వచ్చారు. శ్వేత సౌధంలో కూడా ఆయన పర్యటన గురించి అతి తక్కువ మందికి తెలుసు. కీవ్ ప్రయాణానికి అధ్యక్షుడు జో బైడెన్ పచ్చజెండా ఊపారు. దీంతో శ్వేతసౌధం సిబ్బంది తమ ప్రణాళిక గురించి మాస్కోకు నోటిపై చేశారు. బైడెన్ పచ్చజెండా ఊపారు. దీంతో శ్వేతసౌధం సిబ్బంది తమ ప్రణాళికల గురించి మాస్కోకు నోటిపై చేశారు. బైడెన్ అక్కడున్న సమయంలో అనుకోని ఘటనలు ఏవీ చోటుచేసుకోకుండా ఈ చర్యలు తీసుకొన్నారు. దీనిపై మాస్కో స్పందన వెల్లడించేందుకు అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సులేవాన్ నిరాకరించారు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో భార్య జిల్‌తో కలిసి జోబైడెన్ వీక్ డేట్‌కు వెళ్లారు. కానీ ఆ తర్వాత 36 గంటలు ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. బైడెన్ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లేందుకు ఎప్పుడూ ఉపయోగించే ఎయిర్ ఫోర్స్ వన్ విమానానికి బదులు సాధారణంగా అమెరికా వాయుసేన ఉపయోగించే సి32లో బయల్దేరారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్‌కు చిన్న వెర్షన్. ఆయన వెంట అతి తక్కువ మంది భద్రతా సిబ్బంది, అధికారులు, చిన్న మెడికల్ టీమ్, ఒక రిపోర్టర్, ఒక ఫొటోగ్రాఫర్ ఉన్నారు. వారి వద్ద నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రతాధికారులు స్వాధీనం చేసుకొన్నారు. విమానం జర్మనీలో రామ్‌స్టెయిన్‌లో అమెరికా సైని స్థావరానికి చేరుకుంది. అక్కడి నుంచి పోలండ్‌లోని జెసోస్ నగరానికి చేరుకుని అక్కడి నుండి ఓ రైలులో 10 గంటలపాటు ప్రయాణించి ఉక్రెయిన్‌లోని కీవ్ చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు యుద్ధక్షేత్రాల్లో పర్యటించడం కొత్తేమీ కాదు. వారి సైనికులు ఉన్న చోట, వారు మద్దతు తెలపడం రివాజుగానే వస్తోంది. బైడెన్ ఇప్పుడు ఉక్రెయిన్‌కు వెళ్లడం కూడాదానిలో భాగంగానే చూడొచ్చు.

# 24న సెషన్స్‌కోర్టు ముందుకు శ్రద్ధావాకర్ హత్య కేసు నిందితుడు అఫ్తాబ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** శ్రద్ధావాకర్ హత్య కేసులో నిందితుడు అఫ్తాబ్ పూనావాలాను సంబంధిత సెషన్స్‌కోర్టు ముందు విజ్ఞాపనను దాఖలు చేయాలంటూ మేజిస్ట్రేట్ ఆదేశించారు. అయితే కేసు విచారణ సందర్భంగా పూనావాలాను తనకు అందిన చార్జిషీటు కాపీ, అందులోని పేజీలన్నీ సరైనవేనా అని మేజిస్ట్రేట్ అడగగా సరైనవేనని ఆయన బదులిచ్చాడు. ఢిల్లీ పోలీసులు గత నెల 24న కోర్టుకు 6,629 పేజీల భారీ చార్జిషీటు సమర్పించగా దాన్ని ఈ నెల 73న కోర్టు పరిగణనలోకి తీసుకున్నది. ఈ నెల 24న ఈ కేసులో నిందితుడు అఫ్తాబ్ పూనావాలాను సెషన్స్‌కోర్టులో హాజరుపరచాల్సి ఉన్నది. కోర్టులో ఇంతకుముందే రెండు విజ్ఞాపనలు దాఖలు చేసినట్లు అఫ్తాబ్ పూనావాలా తరఫున కోర్టులో వాదనలు వినిపిస్తున్న అడ్వొకేట్ ఎంఎస్ ఖాన్ తెలిపారు. వీటిలో ఒకటి నిందితుడి విద్యార్హత సర్టిఫికేట్లకు సంబంధించింది కాగా, మరొకటి అతడికి చెందిన స్టేషనరీ వస్తువులు.. నోట్‌ప్యాడ్, పెన్సిల్ తదితరాలకు చెందినదని ఎంఎస్ ఖాన్ అన్నారు. అలాగే చార్జిషీట్ సాఫ్ట్‌కాపీ కూడా కోర్టుకు సమర్పించామని ఆయన అన్నారు. అయితే తనకు కేసు సంబంధించిన ఫుటేజీ ఉన్న పెన్‌డ్రైవ్ ఇచ్చారని, ఆ ఫుటేజీ ఓ క్రమం అంటూ లేదని అడ్వొకేట్ ఖాన్ కోర్టుకు తెలిపారు. ప్రాక్టో ఆప్‌లో శ్రద్ధా వాకర్ మాట్లాడుతున్నట్లు ఉన్న 10-12 సెకండ్ నిడివి కల ఫుటేజీలు ఆ పెన్‌డ్రైవ్ ఉన్నాయని అయితే వాటిలో ఆ ఫుటేజీలు ఒకదానితో ఒకటి సంబంధం లేనట్లు ఉన్నాయని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ సందర్భంగా విచారణ అధికారి బదులిస్తూ.. అడ్వొకేట్ ఖాన్‌కు అందజేసిన చార్జిషీటు సాఫ్ట్‌కాపీని వేర్వేరు ఫోల్డర్లుగా విడగొట్టారని అన్నారు. ఆ సాఫ్ట్ కాపీలో ప్రాక్టో ఆప్ నుంచి సేకరించిన వివిధ ఫుటేజీలు, దర్యాప్తు సందర్భంగా సంఘటన స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న నేరాన్ని రుజువు చేసే ఛాయా చిత్రాలు, ఫొటోలు ఉన్నాయన్నారు. ఈ కేసు దర్యాప్తు సంబంధించిన ప్రతీది అడ్వొకేట్ ఖాన్‌కు అందజేశామని విచారణ అధికారి తెలిపారు. అయితే తనకు చార్జిషీటు, ఎఫ్ఐఆర్ ఫోల్డర్లు ఉన్న రెండు భాగాలున్న పెన్‌డ్రైవ్‌ను విచారణ అధికారి అందజేసినట్లు న్యాయవాడి ఎంఎస్ ఖాన్ అంగీకరించారు.

# కిమ్ చేసిన పనికి ప్రమాదంలో లక్షలాది ప్రాణాలు

సియోల్, ఫిబ్రవరి అణ్వాయుధ పరీక్షలతో ఉత్తర కొరియా తరచూ వార్తల్లో నిలుస్తుంటుంది. అయితే ప్రపంచంలోనే అత్యంత బలమైన అణుసామర్థ్యం కలిగిన దేశంగా ఎదగాలన్న దాని ఆకాంక్ష, సొంత ప్రజలనే కాదు, పొరుగున ఉన్న దక్షిణ కొరియా, చైనా, జపాన్ వాసుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది. ఉత్తర కొరియాలోని 'పుంగేరి' భూగర్భ అణుపరీక్షా కేంద్రం కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, దీంతో ప్రజలకు రేడియోధార్మికత ముప్పు పొంచి ఉందని సియోల్ ఆధారిత ఓ మానవ హక్కుల సంఘం తన తాజా అధ్యయనంలో పేర్కొంది. ప్యాంగ్యాంగ్ ఏడో అణు పరీక్షకు సిద్ధమవుతోందని వార్తలు వస్తోన్న వేళ ఈ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది.

అమెరికా, దక్షిణ కొరియా ప్రభుత్వ వివరాల ప్రకారం, ఉత్తర కొరియా 2006-17 మధ్య కాలంలో ఉత్తర హమ్‌గ్యోంగ్ ప్రావిన్స్‌లోని పుంగేరి సైట్‌లో రహస్యంగా ఆరు అణ్వాయుధ పరీక్షలు నిర్వహించింది.

# తెలుగు భాష అమ్మ భాష.. ఆదరించాలి



అక్షర్ యాన్ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ దంపతులను సత్కరిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సిహెచ్ విద్యాసాగర్ రావు

## తెలుగు రాష్ట్రాల సిఎంలు మాతృ భాషను కాపాడాలి

### అంతర్జాతీయ భాషా దినోత్సవంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలుగు భాష అమ్మ భాష అని, మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపు నిచ్చారు. మంగళవారం బేగంపేట టూరిజం ప్లాజా హోటల్ లో అక్షర్‌యాన్ సారథ్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మాతృభాషలపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా దృష్టి సారించారని, నేను కూడా 2025కల్లా హర్యానాలో మాతృభాష అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. అక్షర్ యాన్ ద్వారా కవులను, రచయితలను సన్మానించడం, వారి గొప్ప తనం అందరికీ తెలిసేలా కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు కేవలం రాజకీయ నాయకులు మాత్రమే కాదని, ఆయనకు వివిధ అంశాలపై ఎంతో పట్టు కల్గిన వ్యక్తి అని ఆయన కొనియాడారు. తామిద్దరం అత్యవసర పరిస్థితుల్లో జైళ్లలో గడిపిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసారు. తమిళనాడు, కర్ణాటక తరహాలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో భాషను కాపాడాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బండారు దత్తా త్రేయ సూచించారు. ప్రతి అంశాన్ని తెలుగులో అనువదించి ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. ఇప్పటికే న్యాయ స్థానాల్లో తీర్పులను ఆయా భాషల్లో ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. తాను గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ఐఎల్‌ఓ సదస్సులో హిందీ లో ప్రసంగించానని ఆయన గుర్తు చేసారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా గవర్నర్ వ్యవస్థపై వార్తలు వస్తున్నాయి. కానీ అట్టడుగున ఉన్న (గిరిజన)వాళ్లకే నిధులు చేరాల్సి ఉందన్నారు. ముఖ్యంగా గిరిజనులను ఆదుకోవాల్సి ఉందన్నారు. నిర్లక్ష్యం చేయడం వల్లే ఆందోళణలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు అశ్రద్ధను వీడాలన్నారు. తెలంగాణా, ఏపీ గవర్నర్‌లను ఇక్కడి నుంచి హెచ్చరిస్తున్నా, విజ్ఞప్తి చేస్తున్నా 5వ షెడ్యూల్ ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో బడ్జెట్లో 5శాతం నిధులు గిరిజనులకు చేరేలా దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. రెండు రాష్ట్రాల్లో వీరికోసం తక్షణమూ నిర్ణయం జరిగేలా ఆ దిశగా జీఓ తీసుకొచ్చేలా గట్టి చర్యలు చేపట్టాలని పిలుపు నిచ్చారు.

**సుద్దాల అశోక్ తేజకు పంప కవి పురస్కారం**

ప్రముఖ కవి, గాయకులు, జాతీయ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కు పంప కవి పురస్కారాన్ని సీహెచ్ విద్యాసాగర్ రావు చేతుల మీదుగా అందజేసారు. ఈ సందర్భంగా అశోక్ తేజ చేతికి స్వర్ణ కంకణాన్ని ఆయన బహుకరించారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ ఈ (పంపకవి)పురస్కారం తనను అశువులు ఉన్నంత కాలం అక్షరయానం చేయమంటుందని అన్నారు.

ప్రాణాలు ఉన్నంత కాలం పాటలను పంపిణీ చేయాలంటూ విద్యాసాగర్ రావు తనకు స్వర్ణ కంకణాన్ని బహుకరించారని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర గవర్నర్ గా ఉన్న సమయంలో విద్యాసాగర్ రావు ఒక్క సంతకంతో గిరిజనులకు హక్కు కల్పించి పెనుమార్పు తీసుకు వచ్చారన్నారు. తాను ఉద్యోగం చేస్తున్న సమయంలో మెట్ పల్లి నియోజక వర్గంలో గ్రామీణ ప్రాంత వాసులను సుదూర ప్రాంతాల్లో ఉన్న పెద్దాసుపత్రులకు తరలించేందుకు వీలుగా తన తల్లి గారి పేరుతో అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిన వ్యక్తి విద్యాసాగర్ రావు అన్నారు. ఆయన లో నటుడు కూడా ఉన్నాడని ఆయన తెలిపారు. అమ్మ, నింగి, నేల, ఉన్నంత కాలం తెలుగు భాష బతికే ఉంటుందన్నారు. అమ్మ పాల లాంటి భాష, పుష్పక విమానం లాంటి భాష ఒక్క తెలుగు భాషేనని ఆయన పేర్కొన్నారు. పంప కవి క్రీశ 609,650మధ్య కాలానికి చెందిన వారన్నారు. ఆయన తెలంగాణా రాష్ట్రం జనగామ జిల్లా నింగొండకు చెందిన వారని, ఆయన బోధన్ లో మృతి చెందినట్లు చరిత్ర చెబుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషినల్ చీఫ్ సెక్రటరీ చెల్లప్ప, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూటికుప్పల సూర్యారావు, కూచిపూడి నృత్య కళాకారిణి పద్మశ్రీ పద్మజా రెడ్డి, అక్షర్ యాన్ వ్యవస్థాపకులు అయినం పూడి శ్రీలక్ష్మి, దైవ జ్ఞ శర్మ, తదితరులు పాల్గొని తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. ఈ సందర్భంగా పలువురు, కవులు, కవయిత్రులు రచించిన 14 పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముక్తేవి భారతి, పీఎస్ఎం లక్ష్మి, సుజల గంటి, డా, గురజాల శోభా పేరిందేవి, లలిత వర్మ, లక్ష్మిజన్ను, నామాని సుజనాదేవి, సుధా కోలోచన, పి. పద్మ, పులి జమున, వలిపే రామ్ చేతన్, డా. హిప్నోపద్మాకర్, అక్షరయాన్ ప్రధాన కార్యదర్శి సమ్మెట విజయ, బండారు దత్తాత్రేయ పై సన్మాన పత్రాన్ని తయారు చేసిన ఘాలి లలితా ప్రవల్లికను దత్తా త్రేయ సత్కరించి సన్మానించారు. విశిష్ట రచయిత పురస్కారం దక్కింది. ఈ కార్యక్రమం ప్రారంభంలో తమ గేయాలతో చిన్నారులు అలరించారు.

# పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాల్సింది మీరే

## రిసెప్షన్ అధికారులతో డిజిపి విడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్లలో గల 736 మంది పోలీసు రిసెప్షన్ అధికారులతో డిజిపి అంజనీకుమార్ మంగళవారం విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐడి అదనపు డిజి మహేష్ భగవత్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజనీకుమార్ మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రతిష్టను పెంచడం పోలీసు స్టేషన్లలో వున్న రిసెప్షన్ అధికారులదేనని అన్నారు. పోలీసు శాఖలో అమలవుతున్న 17 ఫంక్షనల్ వర్టికల్స్ ప్రజలకు అన్ని విధాల ఉపయోపడుతుం దని డిజిపి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లలో ఒకే తరహా పోలిసింగ్ అమలవుతుం దని ఆయన తెలిపారు. పోలీసు స్టేషన్లకు వచ్చే వారి సమస్యలను తెలుసుకుని వారిని శాంతపరచాల్సిన బాధ్యత రిసెప్షన్ అధికారులదేనని డిజిపి తెలిపారు. రిసెప్షన్ అధికారులు తమ విధులను చక్కగా నిర్వర్తించి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని డిజిపి కోరారు.




# అధునాతన పిస్టళ్లు, రైఫిల్స్ తయారీకి కారకల్, ఐకామ్ మధ్య ఒప్పందం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అధునాతన పిస్టళ్లు, రైఫిళ్లు తదితర వాటి తయారీలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి కారకల్, ఐకామ్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఈ ఒప్పదాలు జరిగాయి. భారత రక్షణ రంగానికి ఆయుధాల తయారీ సంస్థ మేఘా ఇంజనీరింగ్ గ్రూప్‌కు చెందిన ఐకామ్ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ భాగస్వామ్య సంస్థ కారకల్‌తో మంగళవారం భేటీ అయింది. కారకల్ సీఎస్ఆర్ 338, 308, బోల్ట్ యాక్షన్ స్నిపర్ రైఫిల్స్, సెమీ ఆటోమేటిక్ స్నిపర్ రైఫిళ్లను ఇకపై ఐకామ్‌లోనే తయారు కానున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. రక్షణ రంగాన్ని స్వయం సమృద్ధి చేయడానికి, దేశ రక్షణ ఆశయాలకు సహాయం చేసేందుకు ఈ టెక్నాలజీ ఉపయోగ పడుతుందని సంస్థ ఎండి సుమంత్ తెలిపారు. ఇప్పటికే క్షిపణులు, వాటి ఉపవ్యవస్థలు, కమ్యూనికేషన్‌లు, మందుగుండు సామాగ్రి, కౌంటర్ డ్రోన్ సిస్టమ్‌లు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ శివారులో అత్యాధునిక సౌకర్యాలను కలిగి ఉన్న ఐకామ్ ఇంజినీరింగ్, రక్షణ పరికరాలను తయారు చేస్తోందని చెప్పారు.

# కొనసాగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియ

## రేపటితో ముగియనున్న గడువు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఆ హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నామినేషన్ల ప్రక్రియ రేపటితో ముగియనుంది. ఈ నెల 16 నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి 10 మందికిపైగా నామినేషన్లను దాఖలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల్లో ప్రధాన సంఘాలుగా ఉన్న పీఆర్‌టీయూ టీఎస్ తరపున గుర్రం చెన్నకేశవ రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ నుంచి పి మాణిక్‌రెడ్డి, ఎస్‌టీయూ టీఎస్ తరపున భుజంగరావులు ఇప్పటికే తమ నామినేషన్లను దాఖలు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి నేడు(బుధవారం) నామినేషన్ దాఖలు చేయనున్నారు. పార్టీల పరంగా చూసినట్టయితే కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ ప్రతిపాదించిన ఏవీఎన్ రెడ్డి రేపు(గురువారం) నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్టు తెలిసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా తెలంగాణ స్కూల్స్, టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్‌టీసీఈఏ) రాష్ట్ర అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) రాష్ట్ర అధ్యక్షులు కాసం ప్రభాకర్ కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మంగళవారం నామినేషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. నామినేషన్లను ఈ నెల 23(రేపటి) వరకు స్వీకరించనున్నారు. 24న స్క్రూటినీ నిర్వహిస్తారు. 27 వరకు నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. మార్చి 13న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ నిర్వహించనున్నారు.

# మార్చి 22 నుంచి భారత్ జోడో ఆల్ ఇండియా యు-19 ఛాంపియన్‌షిప్ పోటీలు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** దేశ ప్రజల ఐక్యత కోసం ఎఐసిసి నేత రాహుల్‌గాంధీ ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన భారత్ జోడో యాత్ర విజయవంతం అయినందుకుగాను మార్చి 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా భారత్ జోడో ఆల్ ఇండియా అండర్-19, టి-20 డే అండ్ నైట్ క్రికెట్ ఛాంపియన్‌షిప్-2023



నిర్వహిస్తున్నామని క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వి.హనుమంతరావు మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు నగరంలోని ఎల్‌బి స్టేడియం, విజయ్‌ఆనంద్, అంబర్‌పేట్ వాటర్ వర్క్స్ గ్రౌండ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో దేశంలోని హార్యానా, ఢిల్లీ, తమిళనాడు, తెలంగాణ, విదర్భ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 12 టీమ్‌లు పాల్గొంటాయని చెప్పారు. తాను క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్‌గాంధీ క్రీడలకు చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పేద, మధ్యతరగతికి చెందిన క్రీడాకారులు ఈ పోటీలను ఉపయోగించాలనే ఉద్ధేశంతోనే ఈ క్రీడలను నిహిస్తున్నామన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిననాటినుంచి ప్రతిపక్ష పార్టీలను, నాయకులను ఎలా అణగదొక్కాలనే ఉద్ధేశ్యంతోనే ఈడి, సిబిఐ సంస్థలు దాడులు చేస్తున్నాయని, అక్రమంగా అరెస్టులు, కేసులు బనాయించడం అత్యంత దారుణమని వి.హనుమంతరావు చెప్పారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర విజయవంతంగా అయినందున సోనియాగాంధీ సమక్షంలో ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహిస్తున్న ఎఐసిసి ప్లినరీ సమావేశాలను అడ్డుకునేందుకు కక్షపూరితంగా ప్రధాని నరేంద్రమోదీ, సిఎం కెసిఆర్ అడ్డుకునే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శంభుల శ్రీకాంత్‌గౌడ్. అవినాష్, జలంధర్, రజనీకాంత్, మహేందర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యే అయినందుకే

# సాయన్నపై చిన్నచూపు

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** గతంలో ప్రముఖులు కానివారికి సైతం అధికార లాంఛనాలతో నిర్వహించిన ప్రభుత్వం సాయన్న దళితుడు కాబట్టే అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకుండా చిన్నచూపు చూసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. ఈమేరకు మంగళవారం బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య తదితరులు

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ ఒక దళితబిడ్డగా కంటోన్మెంట్‌లో తనదైన ముద్రవేసిన సాయన్న ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల మన్ననలు పొందాడన్నారు. బిఆర్ఎస్ పార్టీలోనూ సీనియర్ ఎమ్మెల్యేగా సాయన్న కొనసాగుతున్నా ప్రభుత్వం ఆయనకు తగిన గౌరవం ఇవ్వలేదన్నారు. దళిత నేతలపై ప్రభుత్వ తీరు మారకుంటే భవిష్యత్‌లో తగిన బుద్ధి చెబుతామని చెన్నయ్య హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీధర్‌రావు, బంగి ఆనంద్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శులు వెంకటయ్య, రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కమల్, కళ్యాణ్, పంజాగుట్ట విగ్రహ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# మాయమాటలు చెప్పి బాలికపై అత్యాచారం

**హైదరాబాద్ (చార్మినార్), ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మైనర్ బాలికకు మాయమాటలఉ చెప్పి ఓ యువకుడఉ అత్యాచారానికి పాల్పడిన ఘటన మైలార్‌దేవ్‌పల్లిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ మధుకరణ్ తెలిపిన వివరాల ప్రకారం..... చార్మినార్ ప్రాంతం నుండి ఓ యువకుడు మైనర్ బాలికకు(15) మాయమాటలు చెప్పి నార్సింగి పరిధిలోని వట్టిపల్లికి తీసుకువెళ్ళాడు. ఆ యువకుడి మాయలో పడిన బాలికను వట్టిపల్లిలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అత్యాచారానికి పాల్పడిన యువకుడిని పోలీసులు విచారిస్తున్నారు.

# తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో నేడు ధర్నా

**పెద్దపల్లి జిల్లా బ్యూరో - ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పోరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్‌పై అవిశ్వాసం పెట్టి పదవినుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ నేడు బుధవారం తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అద్యక్షుడు హైకోర్టు న్యాయవాది గొర్రె రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ ధర్నాలో రామగుండం ప్రాంత ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, మహిళాసంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మేయర్ అనిల్‌కుమార్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఇతని పాలనలో మరింత అవినీతి జరుగకుండా కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టి తీసేయాలని ఆయన కోరారు. తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దర్నాను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# వీధి కుక్కల నుంచి చిన్నారులను కాపాడాలి

## వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

### భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఆ హైదరాబాద్ మహానగరంలో వీధికుక్కల నుంచి ప్రజలను, చిన్నారులను కాపాడాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల నిర్మూలనకు తగు జాగ్రత్తలు పాటించని జీహెచ్ఎంసీ అదికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంబర్‌పేట్ ఎరుకల బస్తీలో వీధికుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాలుడి కుటుంబానికి తగిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు వీధికుక్కలకు ఇంజక్షన్లు ఇచ్చి వదిలేయడం కాకుండా శాశ్వత నివారణ మార్గాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగర వీధుల గుండా ఒంటరిగా నడచి వెళ్లాలంటే చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయపడాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. వీధి కుక్కల ప్రమాధాన్ని గుర్తించి తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఉమ్మడి రాష్ట్రంలో రైతు కంట తడి, కెసిఆర్ పాలనలో పంట తడి

## ● అధికారం కోసం బిజెపి మాయమాటలు : మంత్రి హరీశ్‌రావు



**దుబ్బాక, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టిడిపి పాలనలో రైతులు కంట తడి పెట్టుకునే వారు నేడు స్వరాష్ట్ర పాలనలో సిఎం కేసిఆర్ కృషితో కాళేశ్వరం సాగునీరు ప్రాజెక్ట్‌తో ప్రతి ఎకరాకు పంటతడి ఉందని రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్యా శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని నార్లేన్‌గడ్డ ఆమ్లేట్ గ్రామంలో మంత్రి హరీష్ రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా జడ్పిఛైర్ పర్సన్ రోజాశర్మలతో కలసి తెలంగాణ విగ్రాహాన్ని ఆవిష్కరించడంతో పాటుగా గ్రామంలో మహిళ భవనం, ముదిరాజ్ సంఘాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో యాసంగిలో వ్యవసాయ బందు ఉండేది కాని నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాతే ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంతో పాటుగా 24 గంటల పాటు ఉచిత కరేంట్, విత్తనం వేయక మందే రైతు బంధు వచ్చి రైతుల ఖాతాల్లో పడుతున్నాయన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో బోర్లు వేస్తే చుక్క నీరు రాని పరిస్థితి ఉండేదని బోరు అప్పు తీర్చడానికి పుస్తేలతాడు అమ్ముకునే పరిస్థితి ఉండేదని కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో ప్రతి గ్రామానికి కాలువలు, వాగులు మందు టెండల్లో నిండి పారుతున్నాయన్నారు. తెలంగాణ వచ్చాకే కాళేశ్వరంతో ప్రతి ఎకరాకు సాగునీరు, మిషన్ భగిరథతో ప్రతి ఇంటికి త్రాగు నీరు అందుతుంది. చేతల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం మాటల్లో బిజెపి అన్నారు. ప్రజల క్షేమం కోసం పనిచేసేది బిఆర్ఎస్ అని అధికారం కోసం మాటలు మాట్లాడేది బిజెపి అన్నారు. రైతుల క్షేమం కోసం రోజుకు 30 కోట్లు వెచ్చించి నెలకు వెయ్యి కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు నిరంతరం కరెంట్ అందిస్తుంది కేసిఆర్ అన్నారు. సర్కార్ ఆస్పత్రులు నేడు ప్రజలకు అన్ని రకాల సదుపాయాలతో పాటుగా మంచి వైద్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొత్త పుష్పలతకిషన్ రెడ్డి, జడ్పిటిసి కడతాల రవిందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింత జ్యోతికృష్ణ, పిఏసిఎస్ ఛైర్మన్ శేర్ల కైలాసం, ఎంపిటిసి రాధమనోహర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చెక్కపల్లి పద్మయ్య, ఉప సర్పంచ్ రెడ్డబోయిన మాదవిస్వామి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ పందరి రాజా లక్ష్మన్ రావు, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ సంజీవరెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు ఎమ్మ యాదగిరి, ఎమ్మ నర్సింలు, రైతు బంధు సమితి గ్రామ అధ్యక్షుడు సౌడు రాజు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానాల శ్రీనివాస్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

**బిఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి**

**మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేసిన షర్మిల**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని వైఎస్సాఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం మహిళల పట్ల బిఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ మహిళా కమిషన్‌లో ఫిర్యాదులు చేశారు. మహిళలకు రక్షణా కూడా లేదన్నారు. మద్యం అమ్మకాలు, డ్రగ్స్ విచ్చల విడిగా అమ్ముతున్నారు. మహానగరంలో సైతం నడిబొడ్డున మీద అత్యాచారాలు జరుగుతున్నా యన్నారు. మహిళల పట్ల కెసిఆర్‌కు నిర్లక్ష్యం ఎక్కువ, మహిళలు అనే సానుభతి కూడా ఈ సర్కారుకు లేదన్నారు. మహిళలు ఆందోళన చేస్తే జుట్టుపట్టుకుని అరెస్టు చేస్తున్నారని, జైల్లో పెట్టి చరిత్ర హింసలకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. మహిళల పట్ల దాడులు జరుగుతుంటే బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం లేదన్నారు. రాష్ట్రంలో మహిళా కమిషన్ ఉండి ఏం చేస్తున్నట్లు అంటూ ప్రశ్నించారు. సాక్షాత్తు గవర్నర్‌ను అసభ్య పదజాలంతో దూషించారన్నారు. తాను 3800 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కెసిఆర్ సర్కారు నిలదీస్తే నన్ను నానా మాటలు అంటున్నారన్నారు. ప్రతి రోజు పాదయాత్రంలో సర్కార్ వైఫల్యాలను ప్రశ్నించానని అన్నారు. ఎమ్మెల్యేల అవినీతి అక్రమాల గురించి మాట్లాడితే నాపై మాటల దాడుల చేస్తున్నారన్నారు. మంత్రి అని చూడకుండా ఒక మంత్రి మరదలు అంటే, ఒక మంత్రి శిఖండి అంటున్నారు. ఇలా ఎవరికి వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారని, ఇదేనా తెలంగాణలో మహిళలకు ఇచ్చే మర్యాద అన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నాపై దూషణలు చేసిన వ్యాక్తుల పేర్లతో కలిసి ఫిర్యాదు చేశానన్నారు. అధికారంలో ఉన్న వాళ్ల భార్యలు, బిడ్డలు ఏమైనా చేయవచ్చా? స్వయంగా సిఎం కుమార్తె లిక్కర్ స్కాంలో ఉందన్నారు. శంకర్‌నాయక్ భార్యత ఏకంగా భూ కబ్జాలకు పాల్పడుతుందన్నారు. మీకొక న్యాయం, మాకు ఒక న్యాయమా? అంటూ ప్రశ్నించారు. అధికారంలో ఉండి మీరు ఏమైనా అనోచ్చా అన్నారు. మేము ఎక్కడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదని, ఎవరిని ఏమీ అనలేదన్నారు. కేవలం అవినీతి మాత్రమే ప్రశ్నించినట్లు తెలిపారు. మహిళలపై పెరుగుతున్న దాడులకు మహిళలు అందరూ ఏకతాటిపై రావాలన్నారు. బిఆర్ఎస్‌కి వ్యతిరేక ఉద్యమం మొదలు పెట్టాలన్నారు. కెసిఆర్ సర్కార్ మహిళలను గౌరవించే సర్కార్ కాదన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఆగడాలు, తిట్లు ఆగాలి. వీరిపై చర్యలు తీసుకోవాలి.

# 'దళిత బంధు' నిధులను తక్షణమే విడుదల చేయాలి

## రాష్ట్ర మాదిగ సంక్షేమ సంఘం, మహా ఎంఆర్‌పిఎస్, తెలంగాణ దండోరా నాయకులు



ధర్నాలో పాల్గొన్న టిఎంఎస్ఎస్, మహా ఎంఆర్‌పీఎస్, తెలంగాణ దండోరా నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం కేటాయించిన 17,700 కోట్ల దళితబందు నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య మాదిగ, మహా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ముత్య పాగ నర్సింగ్ రావు మాదిగ, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రాము మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఈ మూడు సంఘాల ఆధ్వర్యంలో దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి వారు మాట్లాడుతూ దళిత బంధు మొదటి విడత నియోజకవర్గానికి ఐదు వందల మందిని గుర్తించి, ఇస్తామని చెప్పారు కానీ కనీసం నియోజకవర్గానికి వంద మందికి కూడా దళిత బంధు ఇవ్వలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం దళితులకు ఆశ చూపించి మోసం చేయటం తప్ప, ఆచరణలో మాత్రం దళితులకు చేస్తున్నది ఏమీ లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమంలో కానీ, నాయకులు చేసే పాదయాత్రలలో కానీ జెండాలు మోసేది, ప్రాణాలకు తెగించి పోరాడేది దళితులేనని, అటువంటి దళితులకు ప్రభుత్వం అన్యాయం చేస్తూ ఉంటే అధికార పక్షంలో ఉన్న ఎమ్మెల్యేలు, నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే దళితులకు కేటాయించిన దళిత బంధు నిధులు విడుదల చేసి, దళితులకు అందచేయాలని, లేనిపక్షం మూడు సంఘాలు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మహా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రమ్య, తెలంగాణ దండోరా ప్రధాన కార్యదర్శి కల్మూరి రాములు, మహిళా ప్రధాన కార్యదర్శి రుద్రమ దేవి, యువజన నాయకులు వెంకటస్వామి, మీసాల ఎలేషు, బి.బాలరాజు, మొగలయ్య, టీఎంఎస్ నాయకులు కే.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు కామన్ బ్రాండింగ్

- తెలంగాణ ముద్ర ఉండేట్లుగా బ్రాండ్ పేరు
- మహిళల వస్తువులకు సార్వత్రిక గుర్తింపునకు సెర్ప్ ప్రయత్నాలు
- సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సెర్ప్ అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మహర్దశ పట్టనుంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా మహిళల సంఘాల ఉత్పాదక వస్తువులకు కామన్ బ్రాండింగ్ ఏర్పాటు కానుంది. కామన్ బ్రాండింగ్ ఏర్పాటు కానుంది. తెలంగాణ ముద్ర ఉండేట్లుగా బ్రాండ్ పేరు ఉండనుంది. మహిళల వస్తువులకు సార్వత్రిక గుర్తింపుకు సెర్ప్ ప్రయత్నాలు చేస్తుంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్, లేబిలింగ్ కోసం ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఫ్లిప్ కార్ట్ సంస్థతో ఒప్పందం కాగా, అమెజాన్ వంటి ఆన్‌లైన్ వంటి మార్కెటింగ్ సంస్థలతో మరిన్ని ఒప్పందాలు చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్ణయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సెక్రటరీ, సెర్ప్ సిఈఓ సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావుతో పాటు సెర్ప్ అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రుల నివాసంలో ఈ మేరకు సమీక్షించారు. త్వరలోనే పలు సంస్థలతో ఒప్పందాలు, మహిళా ఉత్పత్తులకు మార్కెటింగ్ కోసం చేసుకోబోతున్నాం. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక మహిళా సంఘాలు స్వయంగా అనే వస్తువులను ఉత్పత్తిచేస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా కూడా వారు తయారు చేస్తున్న నిత్యావసర సరుకులు, ఇతర వస్తువుల మార్కెటింగ్ పలు విధాలుగా జరుగుతున్నది. ఫ్లిప్ కార్ట వంటి సంస్థలతో కూడా ఒప్పందాలు కుదిరాయి. అయితే తెలంగాణ మహిళా సంఘాలు తయారు చేస్తున్న వస్తువులకు మంచి డిమాండ్ ఉంది. ఆ డిమాండ్‌కు తగ్గట్లుగా మరింత ఆకర్షణీయంగా లేబులింగ్, ప్యాకింగ్ చేస్తూ, బ్రాండింగ్ ఏర్పాటు చేస్తే మన వస్తువులకు మరింత డిమాండ్ పెరిగి, కొనుగోలు బాగా సాగి, లాభదాయకంగా ఉంటుంది. దీంతో అమెజాన్ వంటి అంతర్జాతీయ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, మరింతగా వ్యాపారం చేయవచ్చు అన్నారు. ఈ దిశగా ఆలోచిస్తూ తెలంగాణ డ్వాక్రా సంఘాల మహిళల ఉత్పత్తులకు మంచి బ్రాండింగ్ చేయాలని వివరించారు.

ఇప్పటికే సిఎం కెసిఆర్ కృషి ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పేరు మారుమోగుతోంది. అభివృద్ధి, సంక్షేమంలో మనకు సాటి లేదు, వివిధ పథకాలు రూపకల్పన, అమలులో కూడా తిరుగులేదు. మన మహిళా సంఘాల అభివృద్ధి, పొదుపులోనూ మనమే దేశంలో నెంబర్‌వన్ ఉన్నామన్నారు. ఈ దశలో మన తెలంగాణ పేరు ప్రతిష్టలు ఉట్టి పడేలా, మహిళా ఉత్పత్తులను సులువుగా, ఆకర్షణీయంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడుపోయేలా ఈజీగా, క్యాచీగా ఉండేటట్లుగా బ్రాండింగ్ ఉండాలని మంత్రి సూచించారు. త్వరలోనే సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకుని వెళ్లి వారి అనుమతితో కొత్త బ్రాండింగ్ చేయలని అందుకు తగ్గటట్లుగా పలు పేర్లను పరిశీలించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులను ఆదేశించారు.



## కృష్ణా జలాల తరలింపును నిలిపివేయండి

తుంగభద్ర బోర్డుకు ప్రభుత్వం లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** ట్రిబ్యునల్ తీర్పును విరుద్ధంగా కృష్ణా జలాలను కేసీ కెనాల్‌కు తరలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోందని... ఆ ప్రక్రియను నిలిపివేయాలని తుంగభద్ర బోర్డును తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌పై ఫిర్యాదు చేస్తూ తుంగభద్ర బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం మంగళవారం లేఖ రాసింది. కెసి కెనాల్ ఆయకట్టుకు సుంకేశుల ఆనకట్ట ద్వారా తుంగభద్ర జలాలను మాత్రమే వినియోగించాలని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. అయితే, తుంగభద్ర జలాలను తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌కు తరలించి శ్రీశైలం ద్వారా కృష్ణా జలాలను కేసీ కెనాల్‌కు తరలించాలని ఏపీ భావిస్తోందని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలా కేసీ కెనాల్‌కు కృష్ణా జలాల తరలింపు ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. ఇప్పటికే రెండు టీఎంసీలు నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలిస్తోందని... తాజాగా మరో రెండు టీఎంసీలు తరలించాలని ప్రయత్నిస్తోందని తెలంగాణ ప్రభుత్వం ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రయత్నాలను నిలువరించాలని... కేసీ కెనాల్‌కు కృష్ణా జలాల తరలింపును నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు తుంగభద్ర బోర్డు కార్యదర్శికి తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్ లేఖ రాశారు. తక్షణమే దీనిపై స్పందించి తగిన విధంగా కృష్ణా జలాల కేటాయింపులు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం తుంగభద్ర బోర్డును లేఖలో కోరింది.

ఇదిలా ఉంటే ఫిబ్రవరి 17న హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణానది యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ పలు వాదనలు వినిపించారు. ఈ నీటి సంవత్సరంలో కృష్ణా జలాల వినియోగం లెక్కలు తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం నదీ యాజమాన్య బోర్డును కోరింది. అప్పుడు రెండు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం ఎంత నీటిని వాడుకున్నది.. ఎవరి వాటా ఎంత మిగిలి ఉందో తేలిపోతుందని పేర్కొంది. ఆ ఏపీ ఇప్పటికే వాటాను మించి కృష్ణా జలాలను వాడుకుంటున్న తెలంగాణ.. నీటి లెక్కల విషయంలో కఠినంగా ఉండాలని కోరింది. తెలంగాణకు ఇంకా 141 టీఎంసీల నీటి వినియోగానికి అవకాశం ఉందని ఈ మేరకు నీటిని వాడుకుంటామని ఈఎన్సీ మురళీధర్ పేర్కొన్నారు. మార్చి నెల మొదటి వారంలో మరోమారు త్రిసభ్య కమిటీ సమావేశమయ్యే అవకాశం ఉంది.



డ్యూటీమీట్‌లో పతకాలు సాధించిన వారికి జరిగిన సన్మానంలో పాల్గొన్న డిజిపి అంజనీకుమార్. ఫొటోలో సిఐడి చీఫ్ మహేష్‌భగవత్ తదితరులున్నారు

## డ్యూటీమీట్ విజేతలకు డిజిపి సన్మానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇటీవల జరిగిన అఖిల భారత పోలీసు డ్యూటీమీట్‌లో పతకాలు సాధించిన తెలంగాణ పోలీసు అధికారులు, సిబ్బందికి డిజిపి అంజనీ కుమార్ మంగళవారం నాడు ఘనంగా సన్మానించారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు సంక్షేమం, క్రీడల విభాగం అదనపు డిజిపి అభిలాష్ బిస్త్, సిఐడి చీఫ్ మహేష్ భగవత్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్యూటీ మీట్‌లో పతకాలు సాధించిన ఇన్‌స్పెక్టర్ మన్‌మోహన్, ఎస్ఐ వెంకటేష్, హెడ్‌కానిస్టేబుళ్ల విజయ్, తిరుపతి, రామకృష్ణా రెడ్డి, కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌లను డిజిపి సన్మానించి వారిని అభినందించి మెమొంటోలను అందించారు.

## ములుగు జిల్లాలో మావోల లేఖల కలకలం!

≫ హెచ్చరించారు. రెండు రోజుల క్రితం ఏటూరునాగారం ఏరియాలో విడుదల చేసిన ఈ లేఖతో రాజకీయవర్గాలలో గుబులు పుట్టించింది. ఇదిలా ఉండగా 24 గంటలు గడవకముందే గోదావరి అవతల పాములూరు రోడ్డుపై స్పెషల్ పార్టీ పోలీసులు కూంబింగ్ కోసం వెళ్తుండగా మావోయిస్టు నక్సల్స్ ఆధునిక టెక్నాలజీతో మందుపాతరను అమర్చి కలకలం రేపారు. రోడ్డుపై బీర్‌సీసా పడవేసి ఉండడంతో అనుమానం వచ్చిన పోలీసు బలగాలు బాంబ్ స్క్వాడ్ ద్వారా ఆ బీరుసీసాను కదపడంతో నిర్వీర్యం అయిపోయింది. చూసి చూడనట్లుగా బీర్‌సీసా ఖాళీదేగా అని కాలితో నెట్టినట్లు అయితే అది పేలి ప్రాణాపాయం జరిగి ఉండేది. కానీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రోడ్డుపై బీరుసీసా ఉండడం ఏమిటని గమనించి చూడడంతో ఇనుప ముక్కలతో కూడిన వైరు అందులో పెట్టి వైర్‌ను రోడ్డు కింది భాగంలో వదిలివేశారు. కాలు తగిలితే బీరు సీసా పేలే విధంగా అమర్చారు. గతంలో మునుపెన్నడూ కూడా 40 సంవత్సరాల కాలంగా మావోయిస్టులు పాల్పడిన సంఘటనలో భాగంగా ఇలాంటి బీర్‌సీసా బాంబులు పెట్టిన దాఖలాలు లేవు. ఇదే ప్రథమంగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి బీర్‌సీసా బాంబును పెట్టినట్లుగా ఇంటెలిజెన్స్ వర్గాలు అంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని పోలీసు అధికారులు హైఎలర్ట్‌ను ప్రకటించారు. అంతేకాకుండా కూంబింగ్ కోసం పోలీసు బలగాలను పంపకుండా భద్రత చర్యలు చేపట్టారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై బిజెపి పునరాలోచన.. కారణమిదే!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు బిఆర్ఎస్ మద్దతును ప్రకటించడంతో బిజెపి పునరాలోచనలో పడింది. తొలుత ఎన్నికలకు దూరంగా ఉండాలనుకున్న బిజెపి... మారుతున్న సమీకరణాలపై దృష్టి పెట్టింది. స్థానిక సంస్థ ఎమ్మెల్సీ కోటాలో ఓటు హక్కు వినియోగించుకునేవారి సంఖ్య 118 కాగా ఏ పార్టీ సొంతంగా గెలిచే పరిస్థితి లేదు. ఎంఐఎం 52, బిజెపి 25, బిఆర్ఎస్‌కు 41 ఓట్లుండగా గెలుపు కోసం 60 ఓట్లు రావాల్సి ఉంది. ఈనెల 23న నామినేషన్ల ప్రక్రియ ముగియ నుండగా బిజెపి బరిలో ఉంటే ఓటింగ్ తప్పనిసరి అవుతుంది. జిహెచ్ఎంసి పరిధిలోని స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, కంటోన్మెంట్ సభ్యుల ఓట్లు కలుపుకుంటే బిఆర్ఎస్, ఎంఐఎం కూటమి అభ్యర్థికి అత్యధిక ఓట్లు పడనున్నాయి.

# ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పరీక్షల కోసం 1473 కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 9,51,022 మంది విద్యార్థులు
- అధికారుల సమీక్షలో మంత్రి సబితాఇంద్రారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్చి 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షలపై మంత్రి సబిత మంగళవారం తన కార్యాలయంలో విద్యా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్, విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ పాల్గొన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఇంటర్మీడియట్‌వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇంటర్ పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు.

ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. పరీటలకు 9,51,022 మంది హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నామని.. అయితే విద్యార్థులు ఉదయం 8.45 గంటల లోపుగా పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లాలని మంత్రి సూచించారు. లక్షలాది మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్న నేపథ్యంలో సజావుగా జరిగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో హైపవర్ కమిటీలను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. పరీక్షల నిర్వహణా బాధ్యత ఈ కమిటీలదేనని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల్లో అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సబితా



ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలో నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సమయానికి చేరుకునే విధంగా బస్సులను నడపడం జరుగుతుందన్నారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.

## పదోన్నతి అడిగితే సస్పెండ్ చేస్తారా?

### మాతృభాష దినోత్సవం సందర్భంగా భాషా పండితులకు మీరిచ్చే కానుక ఇదేనా?

సిఎం కెసిఆర్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, భాష పండితులు చేస్తున్న సేవలను గురించి సత్కరించాల్సిన మీరు అందుకు భిన్నంగా పరిస్థితులు నెలకొనడం అత్యంత దురదృష్టకరం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు బహిరంగ లేఖ రాసారు. పదోన్నతులు అడిగినందుకు ముగ్గురు భాషా పండిదులను సస్పెండ్ చేయడం గర్హనీయం అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన భాషా పండితులకు ఇచ్చే కానుక ఇదేనా? రాష్ట్ర ప్రభుత్వ చర్యను భారతీయ జనతా పార్టీ, తెలంగాణ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. రాష్ట్రంలో 8500 మందిపైగా భాషా పండితులున్నారు. వీరికి 22 ఏళ్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదనే విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. వేల మంది ఉద్యోగులను అర్హత ఉన్నప్పటికీ 22 ఏళ్లుగా ప్రమోషన్లు ఇవ్వకపోవడం దారుణం. వీరంత ఇంకా ఎస్జీటిలుగానే కొనసాగుతుండటం బాధకరం అన్నారు. నిబంధనలు ప్రకార ప్రాథమికోన్నత తరగతుల వరకే బోధించాల్సి ఉన్నప్పటికీ, అందుకు భిన్నంగా 9,10 తరగుతల విద్యార్థుల బోదనా తరగతుల బాద్యతలు కూడా వీరపై మోపడం ఏ మాత్రం సరికాదన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ ప్రమోషన్ల సమస్యను పరిష్కరించకుండా, బలవంతపు అదనపు భారం మోపడమంటే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లేగానే భావిస్తున్నాం. ఈవిషయంలో న్యాయబద్ధంగా ఆందోళన చేస్తున్న భాషా పండితులపట్ల సానుకూలంగా స్పందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ సస్పెన్షన్ల పేరుతో అణచివేత ధోరణిని అవలంభిస్తుండటం క్షమించారని విషయం అన్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాషా పండితులకు వెంటనే ప్రమోషన్లు కల్పిస్తామని మీరిచ్చిన హామి ఏమైందన్నారు. ఇంత వరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. కోర్టులో కేసు ఉందనే సాకుతో 22 సంవత్సరాలుగా పదోన్నతులు ఇవ్వకుండా నాన్చివేత ధోరణిని అవలంభించడం ఏ మాత్రం సరికాదన్నారు. తక్షణమే కోర్టులో ఉన్న కేసు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన భాషా పండితులందరికి పదోన్నతులు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. అట్లాగే ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అదేవిధంగా వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసిన పెరిగిన ధరలనకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జూలై 1వ తేది నుంచి జీతాలు చెల్లించాల్సిన డిమాండ్ చేశారు.

# లైఫ్‌సైన్సెస్ ఇకో సిస్టం విలువను రెట్టింపు చేస్తాం

ఎనిమిది లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తాం

ఐటి, పరిశ్రమల మంత్రి కె.తారకరామారావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2028 నాటికి లైఫ్‌సైన్స్ ఈకో సిస్టం విలువను రెట్టింపు చేస్తామని ఐటి, పరిశ్రల శాఖ మంత్రి కె.తారకరామారావు మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుతం 50 బిలియన్ డాలర్ల విలువ కలిగిన లైఫ్ సైన్సెస్ ఈకోసిస్టంను రెట్టింపు చేయనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం బయో ఆసియా సదస్సు నేపథ్యంలో మంత్రి కెటిఆర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నాలుగు లక్షల ప్రస్తుత ఉద్యోగాల సంఖ్యను రెట్టింపు చేసి ఎనిమిది లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. బయో ఆసియా ప్రాముఖ్యతతో పాటు జీవశాస్త్ర, ఫార్మా రంగాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన, చేపట్టనున్న చర్యల గురించి వివరించారు. 19 సదస్సులను పూర్తిచేసుకుని ఈ సారి ప్రతిష్టాత్మకమైన 20వ సదస్సును నిర్వహించుకోబోతున్నామన్నారు. ఈనెల 24వ తేది నుంచి 26వ తేది వరకు ఈ సదస్సు ఉంటుందన్నారు. అడ్వాన్సింగ్ ఫర్ వన్: షేపింగ్ నెక్ట్స్ జనరేషన్ హ్యూమనైజ్డ్ హెల్త్‌కేర్ అన్న ఇతి వృత్తంతో ఈ సదుస్సు జరగనుందన్నారు. బయో ఆసియా గత 19 సంవత్సరాలలో మూడు బిలియన్ డాలర్లు సుమారు 24 కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకుని వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు వచ్చిన పెట్టుబడుల్లో కొన్ని ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాయి. భారతదేశ లైఫ్ సైన్సెస్ రంగానికి బయో ఏసియా విస్తృతమైన సేవలను అందించింది. దేశ లైఫ్ సైన్సెస్ రంగంలోని అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ సదస్సు విజయం సాధించింది. వందకుపైగా దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, నోబెల్ అవార్డు గ్రహీతలకు ఆతిథ్యం ఇవ్వగలిగామని, 20 వేలకుపైగా భాగస్వామ్యం చర్యలు, 30 పాలసీ పేపర్లు, సిఫార్సులు ఈ సదస్సు అందించిందన్నారు. 100దేశాలు ఇప్పటి వరకు ఈ సదస్సులో పాల్గొన్నాయన్నారు. గత 20 సంవత్సరాలలో 250కిపైగా అవగాహన ఒప్పందాలను ద్వైపాక్షిక ఒప్పందాలను కుదుర్చుకోవడంలో ఈ సదస్సు భాగస్వామిగా ఉందన్నారు. ఇప్పటికే అనేక దేశాలు భాగస్వామ్య కంట్రీల హోదాలతో ఏషియాలో పాల్గొన్నాయన్నారు. ఈ సారి కూడా పలు దేశాలు బయో ఏషియాలో భాగస్వామ్యం దేశం హోదాలో పాల్గొంటున్నాయని, ఇతర దేశాలకు ఆదర్శంగా బయో ఆసియా సదస్సు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శం ఉందన్నారు. తొలిసారిగా ఆపిల్ కంపెనీకూడా పాల్గొంటుందన్నారు. జీవశాస్త్ర రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మాసిటీ, మెడికల్ డివైసెస్ పార్కు, బయో ఆసియాతో పాటు అనేక ఇతర ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో జీవశాస్త్రం రంగం విలువ ఉద్యోగాలు కూడా 2028 నాటికి రెట్టింపు చేయాలన్నది లక్ష్యం అన్నారు. 2021లో హైదరాబాద్ దాని పరిసాల్లోని



జీవశాస్త్ర రంగం కంపెనీలకు ఏకో సిస్టం విలువ 50 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2028 నాటికి దీన్ని బిలియన్ డాలర్లకు చేరేలా ప్రణాళికలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ రంగంలోని నాలుగు లక్షల ఉద్యోగాలను ఎనిమిది లక్షలకు చేస్తామన్నారు. భవిష్యత్తులోనూ కరోనా వంటి మహమ్మారులు ప్రబలితే ఆదుకోగల స్థాయిలో హైదరాబాద్ ఫార్మిసిటీ ఉండబోతుందన్నారు. జీవశాస్త్ర రంగంలో ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం ఫార్మాసిటీ ఏర్పాటుతో మరింత ఎత్తుకు ఎదుగుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఎంఆర్ఎన్ఏ టీకా కేంద్రం కూడా త్వరలోనే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతున్నారన్నారు. రాష్ట్రంలో 33 జిల్లాల్లోనూ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తుడటం కూడా జీవశాస్త్ర రంగానికి, ప్రజా ఆరోగ్య రంగాన్ని బలోపేతంచేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఫార్మాసిటీకి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదన్నారు. హైదారాబాద్ ఫార్మాసిటీకి కేవలం జాతీయ స్థాయి ప్రాధాన్యతనేకాకుండా అంతర్జాతీయ స్థాయి ప్రాథమిక కూడా ఉందన్నారు. ఎందుకంటే ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచానికి అత్యంత కీలకమైన ప్రాంతంగా ఆవిర్భవించిందన్నారు. పరిశ్రమ ప్రయోజనాలు, పారిశ్రామిక అభివృద్ధి కంటే కేవలం రాజకీయ ప్రయోజనాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ రాజకీయ ప్రయోజనాల కోసం పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తామన్న హామీలను ఇచ్చుకుంటూ వెళ్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందకున్నా, బల్క్ డ్రగ్స్ పార్కును ఇవ్వకున్నా, హైదరాబాద్ ఫార్మాసిటీకి సహాయం చేయకున్నా, ఐటిఐఆర్ రద్దు చేసినా ఆయా రంగాల్లో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు.

## తెలుగు ఫాంట్స్ సృష్టికర్త పురుషోత్తంకుమార్‌ను సన్మానించిన డిజిపి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం సందర్భంగా తెలుగు భాషకు సంబంధించి 120కి పైగా యూనిక్ కోడ్ ఫాంట్స్‌ను సృష్టించిన పురుషోత్తం కుమార్‌ను డిజిపి అంజనీ కుమార్ సన్మానించారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా అంజనీ కుమార్ మాట్లాడుతూ పురుషోత్తం కుమార్ డెస్క్ టాప్ ఆపరేటర్‌గా తన ప్రస్తానాన్ని ప్రారంభించి నేడు అంతర్జాలంలో, ప్రింట్ రంగంలో, వీడి యోలలో కనిపించే తెలుగు ఫాంట్స్‌లో 80 శాతం ఖతులను సొంతంగా తయారు చేయడం తెలుగువారికి గర్వ కారణమని అన్నారు. ఎవరైన తమ చేతిరాతను పురుషోత్తం కుమార్‌కు ఇస్తే రెండు నెలలో దానికి సరిపడే ఫాంట్స్‌ను రూపొందిస్తారని డిజిపి కొనియాడారు. మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కావ్యాన్ని శ్రీశ్రీ దస్తూరిని పరిశీలించి ఆయన రాసినట్లే



పురుషోత్తం కుమార్ ఫాంట్స్‌ను రూపొందించారని డిజిపి వెల్లడించారు. ఇదే విధంగా దివంగత ప్రధాని పి.వి నరసింహారావు రచించిన ది ఇన్‌సైడర్ తెలుగు అనువాదం లోపలి మనిషికి చేసిన డిజైన్ చూసి పివి నరసింహారావు సైతం అప్పట్లో సంతోషించారని డిజిపి తెలిపారు. దీని తరువాత పివి నరసింహారావు స్వయంగా పురుషోత్తం కుమార్ వద్ద తెలుగు టైపింగ్ నేర్చుకున్నారని అంజనీ కుమార్ గుర్తు చేశారు. రాష్ట్ర పోలీసు శాఖ సైతం తెలుగు భాషను మరింత ప్రోత్సహిస్తుందని, ఈ విషయంలో సురక్ష ఎడిటర్‌గా వున్న డిఐజి రమేష్ తన వంతుగా ఎంతగానో కృషి చేస్తున్నారని డిజిపి కొనియాడారు. ఈ క్రమంలోనే తెలుగు ఫాంట్స్‌లో ఎక్కువ సంఖ్యలో ఖతులు రూపొందించిన పురుషోత్తం కుమార్‌ను పోలీసు శాఖ తరపున సన్మానించినట్లు ఆయన తెలిపారు. తనకు పోలీసు శాఖ నుంచి జరిగిన సన్మానంపై పురుషోత్తం కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐజి రమేష్ కూడా పాల్గొన్నారు.

## పోలీసు రవాణా విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీచేసిన డిజిపి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** నగరంలోని పేట్లాబూర్జులో గల పోలీసు రవాణా విభాగంలో డిజిపి అంజనీ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట పి అండ్ ఎల్ డిఐజి రమేష్ కూడా వున్నారు. ఈ సందర్భంగా పోలీసు రవాణా విభాగంలో మరమ్మత్తుల కోసం వచ్చే పోలీసు వాహనాలకు ఇక్కడ జరుగుతున్న మరమ్మత్తులను డిజిపి పరిశీలించి అక్కడి అధికారులతో ఈ విభాగం గురించి, అక్కడి స్థితిగతుల గురించి సమీక్షించారు. పోలీసు వాహనాలు నిరంతరం ఫిట్‌గా వుండాల్సిన అవసరం వుందని డిజిపి తెలిపారు. ఇందుకోసం పోలీసు రవాణా విభాగం సిబ్బంది మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సర్కారు పోలీసు శాఖకు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చిందని, ఈ క్రమంలోనే వేల సంఖ్యలో కొత్త వాహనాలు సమకూరాయని, వీటిని సరైన విధంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత పోలీసులపై వుందని ఆయన అన్నారు. మరమ్మత్తుల కోసం వచ్చే వాహనాలను నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో ఫిట్‌గా వుండేలా చూడాలని అక్కడి అధికారులను డిజిపి ఆదేశించారు.

# కస్టడీ మృతిపై సర్కారుకు హైకోర్టు ఆదేశం

≫ పట్టణ ఇన్‌స్పెక్టర్‌లను చేరుస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

మెదక్ జిల్లాలో పోలీసు కస్టడీలో వుండి అనారోగ్య కారణాలతో గాంధీ ఆసుపత్రిలో చనిపోయిన ఖదీర్ ఖాన్ అనే చిరు వ్యాపారి వ్యవహారం పోలీసుల మెడకు చుట్టుకుంది. జనవరి నెల 27వ తేదీన మెదక్ పట్టణంలో జరిగిన ఓ స్నాచింగ్ కేసులో పట్టణ పోలీసులు ఖదీర్ ఖాన్‌ను అనుమానించారు. దీనిపై జనవరి నెల 29వ తేదీన ఖదీర్ ఖాన్‌ను హైదరాబాద్‌లో వుండగా అదుపులోకి తీసుకుని మెదక్ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించడం తెలిసిందే. ఐదు రోజుల పాటు ఖదీర్ ఖాన్‌ను తమ కస్టడీలో వుంచుకుని విచారించినా అతని వద్ద ఎలాంటి నగలు లభించక పోవడంతో భార్య సిద్దేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులను పిలిపించి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి వారికి అప్పగించారు. అయితే ఖదీర్ ఖాన్ అప్పటికే అనారోగ్యం పాలవడంతో అతను ఆసుపత్రికి వెళితే అనవసర గొడవలు జరుగుతాయని భావించి ఇంట్లోనే వైద్యం చేయించాలని కుటుంబ సభ్యులను బెదిరింపులతో కూడిన ఆదేశాలు ఇచ్చారు. పోలీసుల బెదిరింపులకు భయపడ్డ ఖదీర్ ఖాన్ కుటుంబ సభ్యులు మొదట వారు చెప్పినట్లుగానే నడుచుకున్నారు. అయితే ఖదీర్ ఖాన్ ఆరోగ్యం కుదుట పడక పోవడంతో మొదట మెదక్ పట్టణంలోని ఓ ఆసుపత్రికి, ఆ తరువాత శివార్లలోని కొంపల్లిలో గల ఇంకో ఆసుపత్రిలో చికిత్స అందించినా మెరుగు పడక పోవడంతో చివరగా గాంధీ ఆసుపత్రిలో ఈ నెల 12వ తేదీన చేర్పించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఖదీర్ ఖాన్ మాట్లాడుతూ తనను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని, తలకిందులుగా వేలాడదీసి బెల్టులతో కొట్టారని తెలిపారు. స్నాచింగ్ నేరంతో తనకు సంబంధం లేదని ఎంత చెబుతున్నా వారు ఒప్పుకోకుండా, ఒప్పుకోవాలని, లేకుంటే మరిన్ని కేసులు బనాయిస్తామని బెదిరించారని అతను తెలిపాడు. ఈ సంభాషణ సెల్‌ఫోన్‌లో వీడియో తీయగా దీని తరువాత అతను రెండు రోజులకు అంటే ఈ నెల 16వ తేదీన ఖదీర్ ఖాన్ కిడ్నీలు పాడై మరణించాడు.

ఖదీర్ ఖాన్ చనిపోయిన తరువాత అతను మాట్లాడిన వీడియో బయటకు రావడంతో మెదక్ పట్టణ పోలీసుల దాష్టికం వెలుగు చూసింది. దీంతో పోలీసులు దిద్దుబాటు చర్యలకు దిగి మొదట ఇందులో తమ దోషం ఏమీలేదని స్థానిక మీడియాకు తెలిపారు. అతను అనారోగ్యం వల్లే చనిపోయాడని వారు వివరించారు. అయితే కిడ్నీలపై గాయాలు వుండడం వల్లే ఖదీర్ ఖాన్ చనిపోయాడని గాంధీ ఆసుపత్రి వైద్యులు చెప్పడంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. దీంతో మెదక్ జిల్లా ఎస్‌పి ప్రియ దర్శిని ఈ ఘటనకు బాధ్యులుగా చేస్తూ ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్ఐ రాజశేఖర్, మరో ఇద్దరు కానిస్టేబుళ్లను మొదట బదిలీ చేసి, ఆ తరువాత సస్పెండ్ చేశారు. అయితే ఈలోపు మీడియాలో, సోషల్ మీడియాలో ఖదీర్ ఖాన్ కస్టడీ మరణంపై నిత్యం వార్తలు వస్తుండడంతో వీటిని హైకోర్టు సోమవారం నాడు సుమోటోగా స్వీకరించింది. దీనిపై మంగళవారం చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేబట్టింది. విచారణ సందర్భంగా హైకోర్టు పోలీసులపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇవ్వాలని సర్కారును ఆదేశించింది. కాగా ఈ ఘటనపై సర్కారు తరపున వాదించిన అడ్వకేట్ జనరల్ ఈ కేసులో పోలీసుల దోషం ఏమీలేదని తెలిపారు. ఖదీర్ ఖాన్‌ను స్నాచింగ్ కేసులో అదుపులోకి తీసుకున్న మాట నిజమేనని, అయితే అతనిపై ఆరోపణలను ఆధారాలు లేకపోవడంతో మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులకు అప్పగించిన 14 రోజుల తరువాత అతను మరణించాడని అడ్వకేట్ జనరల్ హైకోర్టుకు వివరించారు. అడ్వకేట్ జనరల్ వాదనలు విన్న తరువాత దీనిపై స్పందించిన హైకోర్టు ఖదీర్ ఖాన్ మరణంపై పూర్తి వివరాలు ఇవ్వాలని, ఇందులో ప్రతివాదులుగా చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డిజిపి అంజనీ కుమార్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, మెదక్ జిల్లా ఎస్‌పి ప్రియదర్శిని, మెదక్ డిఎస్‌పి, పట్టణ ఇన్‌స్పెక్టర్‌లను చేరుస్తూ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను మార్చి 14వ తేదీకి వాయిదా వేసింది.

